Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 189 మేడ్చల్ మల్కాజ్‌గిరి 30 జూలై 2023 ఆదివారం పేజీలు : 4

## 5న ముదుమలైకి రాష్ట్రపతి

చెన్నై : భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆగస్టు 5న నీలగిరి జిల్లా ముదుమలైలోని తెప్పకాడు ఏనుగుల శిబిరాన్ని సందర్శించనున్నారు. ముదుమలై పులుల శరణాలయంలో రఘు, బొమ్మి అనే ఏనుగులను బొమ్మన్, ఆయన భార్య బెల్లి సంరక్షిస్తున్న తీరుపై చిత్రీకరించిన లఘుచిత్రానికి (ది ఎలిఫెంట్ విష్పరర్స్) ఆస్కార్ అవార్డు లభించిన విషయం తెలిసిందే. అనంతరం ముదుమలై ప్రాంతం, బొమ్మన్ దంపతులు అంతర్జాతీయంగా ఖ్యాతిపొందారు. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 9న ప్రధానమంత్రి నరేంద్రమోదీ ముదుమలైకి వచ్చి బొమ్మన్ దంపతులను అభినందించి వెళ్లారు. కాగా ఈనెల 18న బొమ్మన్ దంపతులు రాష్ట్రపతిని ఢిల్లీలో కలుసుకోగా, వారికి జ్ఞాపికను బహూకరించిన ద్రౌపదిముర్ము.. ఘనంగా సత్కరించి పంపించారు. ఈ సందర్భంగా బొమ్మన్ దంపతులు రాష్ట్రపతిని ముదుమలైకు ఆహ్వానించగా, అందుకు ఆమె అంగీకరించారు. ఈ మేరకు ఆమె వచ్చే నెల 5న ముదుమలైకు వెళ్లనున్నారు.

# ఆపరేషన్ ఆకర్ష్!




## భారీ ప్లాన్ సిద్ధం చేస్తున్న కేసీఆర్

హైదరాబాద్/నల్లగొండ : కాంగ్రెస్‌కు కంచుకోటగా భావించే ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఆ పార్టీకి భారీ షాక్ తగలనుందా? ఆ పార్టీకి చెందిన కీలక నేత బీఆర్ఎస్‌లో చేరనున్నారా? పార్టీలో కొన్నాళ్లుగా ఉక్కుపోతకు గురవుతున్న ఆ నేతకు సీఎం కేసీఆర్ గాలం వేశారా? అంటే అవుననే ప్రచారమే జరుగుతోంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రెండు నియోజకవర్గాల బాధ్యతలు చూస్తున్న ఆ నేత.. కొద్దికాలంగా రాష్ట్ర నాయకత్వంపై అసంతృప్తితో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. తాను పార్టీ మారతానంటూ రాష్ట్ర నాయకత్వం దుష్ప్రచారం చేస్తోందని ఆయన ఆరోపిస్తూ వస్తున్నారు. పైగా ప్రత్యర్థి పార్టీకి చెందిన నేతను కాంగ్రెస్‌లో చేర్చుకొని అభ్యర్థిగా నిలబెడితే ఎలా ఉంటుందంటూ తమ నియోజకవర్గంలో సర్వే కూడా చేయిస్తున్నారని అనుచరుల వద్ద వాపోతున్నారు. తనకు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రచారంతో తన ఇమేజీ కూడా దెబ్బ తింటోందని భావిస్తున్నారు. పైగా బీఆర్ఎస్ నుంచి ఆఫర్ వచ్చిందని, ఆ పార్టీలోకి వెళితే ఎలా ఉంటుందని చర్చిస్తున్నట్లు చెబుతున్నారు. మరోసారి బీఆరెస్సే అధికారంలోకి వచ్చే అవకాశం ఉందని కూడా ఆయన అంచనా వేస్తున్నారని, ఆ పార్టీలో చేరితే తమకు రెండు ఎమ్మెల్యే స్థానాలతోపాటు మంత్రి పదవి కూడా దక్కే అవకాశం ఉంటుందని చెబుతున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఈ నేత గులాబీ గూటికి చేరవచ్చన్న అనుమానాలు కాంగ్రెస్‌లో నెలకొన్నాయి. ఇదిలా ఉండగా.. ఉమ్మడి నల్లగొండ జిల్లాకే చెందిన మరో మరో సీనియర్ కాంగ్రెస్ నేతకు కూడా బీఆర్ఎస్ నుంచి ఆఫర్ వెళ్లినట్లు తెలుస్తోంది. అయితే స్థానిక పరిస్థితుల దృష్ట్యా తమకు పదవి దక్కే అవకాశాలు లేవన్న ఉద్దేశంతో ఆయన ఈ ఆఫర్‌ను తిరస్కరించినట్లు తెలుస్తోంది. దీంతోపాటు మెదక్ జిల్లాకు చెందిన మరో సీనియర్ నేతకు కూడా కేసీఆర్ గాలం వేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే హామీలు పూర్తి స్థాయిలో అమలు కాకపోవడం, సుదీర్ఘ పాలన, వైఫల్యాలు తదితర కారణాలతో బీఆర్ఎస్ ప్రభుత్వం పట్ల మెజారిటీ ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొన్నట్లు ప్రచారంలో ఉంది. మరోవైపు కర్ణాటక ఎన్నికల ఫలితాల ముందు ప్రత్యామ్నాయ రేసులో కాంగ్రెసతో పోటీ పడిన బీజేపీ.. ఫలితాల తర్వాత డీలా పడింది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గ్రాఫ్ ఒక్కసారిగా పెరిగింది. దీంతో కాంగ్రెసను వీడదామన్న యోచనలో ఉన్న అనేక మంది నాయకులు.. తిరిగి సర్దుకున్నారు. దీనికితోడు బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల్లోని పలువురు అసంతృప్త నేతలు కాంగ్రెసలో చేరే ప్రయత్నాలు చేస్తున్నారు. వీరిలో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలు ఉన్నారు. దీంతో ముందు ముందు ఇది ఎక్కడికి దారి తీస్తుందోనన్న ఆందోళన బీఆర్ఎసలో మెదలైనట్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే క్షేత్రస్థాయిలో ప్రభావం చూపగల కాంగ్రెస్ నేతలను బీఆర్ఎసలో చేర్చుకునేందుకు సీఎం కేసీఆర్ వ్యూహాలు అమలు చేస్తున్నట్లు పేర్కొంటున్నారు. తద్వారా కాంగ్రెసను బలహీనపరచాలనే వ్యూహంతో ముందుకెళ్తునట్లు, కర్ణాటక ఎన్నికల ఫలితం ఇచ్చిన ఉత్సాహం.. నేతల చేరికలతో ఉరకలు వేస్తున్న ఆ పార్టీకి భారీగా గండి కొట్టే యత్నాల్లో ఉన్నట్లు సమాచారం.

**చేరికల్లో ద్విముఖ వ్యూహం..!** కాంగ్రెసను బలహీనపరిచేందుకు కేసీఆర్ ద్విముఖ వ్యూహాన్ని అమలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇందుకు క్షేత్రస్థాయిలో సుదీర్ఘ కాలంగా కాంగ్రెస్ పార్టీకి ప్రతినిధులుగా వ్యవహరిస్తూ.. ప్రభావం చూపగల నేతలపై దృష్టి పెడుతున్నట్లు సమాచారం. తద్వారా క్షేత్రస్థాయిలో కాంగ్రెసను దెబ్బకొట్టడం, అదే సమయంలో రాష్ట్ర నాయకత్వాన్ని టార్గెట్ చేసి బలహీనపరిచే వ్యూహాన్ని అమలు చేస్తున్నట్లు చెబుతున్నారు. వాస్తవానికి టీపీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి నియామకం తర్వాత రాష్ట్రంలో పార్టీకి ఒక ఉత్సాహం వచ్చినట్లయింది. ప్రజాకర్షక నేత అధ్యక్షుడు కావడంతో.. రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ శ్రేణుల్లో కదలిక వచ్చింది. అయితే నేతలను కలుపుకొనిపోవడం లేదన్న ఆరోపణలూ పార్టీలో వ్యక్తమయ్యాయి. ఈ క్రమంలో రేవంత్‌రెడ్డికి, పార్టీలోని పలువురు నాయకులకు మధ్య తీవ్ర అంతరం పెరిగింది. బీఆర్ఎస్ కోవర్టులంటూ సోషల్ మీడియాలో ప్రచారానికి సంబంధించి అధిష్ఠానం వద్ద ఒకరిపై ఒకరి ఫిర్యాదుల పరంపరా చోటుచేసుకుంది. ఈ క్రమంలో అసంతృప్త నేతలకు తగిన హామీలు ఇచ్చి.. పార్టీలో చేర్చుకోవాలని, వారితోనే కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకత్వంపై ఎదురుదాడి చేయించాలని బీఆర్ఎస్ నాయకత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీకి వచ్చే ఎన్నికల్లో ఎక్కువ సీట్లు వస్తాయని భావిస్తున్న ఖమ్మం, నల్లగొండ, మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు చెబుతున్నారు. ఇందులో భాగంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాపై తమ వ్యూహాన్ని అమలు చేస్తున్నట్లు పేర్కొంటున్నారు. భువనగిరి డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డిని పార్టీలో చేర్చుకున్న కేసీఆర్.. ఆయనకు ఎమ్మెల్సీ పదవి హామీ ఇచ్చారంటేనే కాంగ్రెస్ నుంచి చేరికలకు ఎంత ప్రాధాన్యం ఇస్తున్నారో అర్థం చేసుకోవచ్చునని అంటున్నారు. అయితే అనిల్‌కుమార్‌రెడ్డిని భువనగిరి ఎంపీగా బరిలోకి దించే ఆలోచనలో కేసీఆర్ ఉన్నారన్న చర్చ తాజాగా జరుగుతోంది. కాంగ్రెస్ సిటింగ్ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఈసారి నల్లగొండ నుంచి అసెంబ్లీకి పోటీ చేస్తానని ప్రకటించడంతో.. బీఆర్ఎస్ తరఫున తాను సులువుగా గెలుస్తానన్న అభిప్రాయంతో అనిల్‌కుమార్‌రెడ్డి ఉన్నట్లు చెబుతున్నారు.

**బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి..** కాంగ్రెస్ నేతలను బీఆర్ఎస్‌లో చేర్చుకునే ప్రయత్నాలు కేసీఆర్ చేస్తుంటే.. నల్లగొండ జిల్లాలో కొందరు బీఆర్ఎస్ నేతలు కాంగ్రెసలోకి వెళ్లే ప్రయత్నాలు చేస్తున్నారు. వీరిలో నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం కాంగ్రెసలో చేరేందుకు మార్గం సుగమమైంది. ఆయన పొంగులేటి శ్రీనివాసరెడ్డి ద్వారా రేవంత్‌రెడ్డికి టచ్‌లోకి వెళ్లారు. ఆయనతోపాటు కోదాడ బీఆర్ఎస్ నాయకుడు కన్మంతరెడ్డి శశిధర్‌రెడ్డి సైతం కాంగ్రెసలో చేరనున్నట్లు సమాచారం. మొత్తంగా రాబోయే 15 రోజుల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కాంగ్రెస్ నుంచి బీఆర్ఎసకు, బీఆర్ఎస్ నుంచి కాంగ్రెసకు వలసలు, రాజకీయ కుదుపులు తప్పవన్న ప్రచారం జరుగుతోంది.




**ఒక్కసారి ఎమ్మెల్యేగా గెలిస్తే చాలు.. జనాన్ని పట్టించుకోని నాయకులను చూశాం. జనం బాధల్లో ఉంటే అలా వచ్చి వెళ్లిపోయే నాయకులు తెలుసు. కానీ జనం బాధను తన బాధగా, ప్రజల దుఖాన్ని తన కన్నీటిగా భావించే నాయకులు చాలా అరుదు. అలాంటి అరుదైన నాయకురాలు ఎమ్మెల్యే సీతక్క. కరోనా కఠిన పరిస్థితులైనా.. వరదలైనా.. నా జనం వెంటే నేను అని ఎమ్మెల్యే సీతక్క మరోసారి నిరూపించారు. ఇటీవలి భారీ వర్షాలకు ములుగు ప్రాంతం భారీగా ఎఫెక్ట్ అయ్యింది. ఎటు చూసినా వరదలే.. కన్నీళ్లే. కట్టుబట్టలతో ప్రాణాలు కాపాడుకునేందుకు పరుగులు. అయినా వరద నీటిలో చిక్కుకుపోయిన వారు కూడా ఉన్నారు.**

## సీతక్కను టార్గెట్ చేసిన గులాబీ దండు... జనం కోసం తపనపడినా రాజకీయమేనా...?

నా జనం వరదలో కొట్టుకపోయారు.. హెలికాప్టర్ కావాలి అని ఉదయం నుండి సీఎంకు, కేటీఆర్ కు, మంత్రులకు ఫోన్ చేసినా.. కండ్ల ముందే కావాల్సిన వారు కొట్టుకపోతుంటే.. అంటూ ఎమ్మెల్యే సీతక్క కన్నీరు పెట్టుకున్నారు. కొట్టుకపోయిన వారు సీతక్క కుటుంబీకులు కాదు. చుట్టాలు అంతకన్నా కాదు. తన నియోజకవర్గం ప్రజలు. అంటే తన ప్రజల కోసం సీతక్క ఎంత తపన పడ్డారో ఇదో ఉదాహరణ మాత్రమే. అంతేకాదు మహిళగా కొట్టుకపోయిన బ్రిడ్జిలు దాటుతూ, కాలినడకన వెళ్తూ, మోకాలి లోతు నీళ్లలోనూ జనాన్ని ఓదార్చుతూ ఎమ్మెల్యే సీతక్క పడ్డ కష్టం అంతా ఇంతా కాదు. సర్వం కోల్పోయిన జనానికి ధైర్యం చెప్తూ, తోచిన సహాయం చేస్తూ.. అధికారులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే సీతక్క బాధిత ములుగు ప్రజలకు అమ్మగా మారిపోయింది. సోషల్ మీడియాలో సీతక్క తపన వైరల్ అయ్యింది. రాజకీయాలకు అతీతంగా సీతక్కను ఇష్టపడే వాళ్లు ఉన్నప్పటికీ, తిట్టేందుకు రెడీగా ఉండే పెయిడ్ ఆర్టిస్టులుగా కూడా ఉంటారుగా. అందుకే ఎమ్మెల్యే సీతక్క వీడియోలకు కౌంటర్ గా తాను ఇటీవల అమెరికా వెళ్లిన విమానం ఫోటోలు పెడుతూ.. సీతక్క పేదరికంలోనే ఉంటే స్పెషల్ జెట్ ఎక్కడిది? అంటూ ప్రశ్నించారు. ఆంధ్రజ్యోతి కూడా దీనిపై ఫ్యాక్ట్ చెక్ చేయగా.. అది స్పెషల్ జెట్ కాదని, బిజినెస్ సీట్ అని తేలింది. కాస్త భారమైన తన ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా 18గంటలకు పైగా ప్రయాణం కాబట్టి ప్రయాణించాల్సి వచ్చిందని తేలింది.

అంతేకాదు నిజానికి ఎమ్మెల్యే సీతక్కకు ఇది ఫస్ట్ ఇంటర్నేషనల్ ప్రయాణం కూడా కావటం గమనార్హం.

## కాళేశ్వరం త్రివేణీ సంగమం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి, ప్రాణహిత నదులు

భూపాలపల్లి: ఎగువన వర్షాలతో కాళేశ్వరం త్రివేణీ సంగమం వద్ద గోదావరి, ప్రాణహిత నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వరద పోటెత్తడంతో త్రివేణీ సంగమం వద్ద నీటిమట్టం 13.29 మీటర్లకు చేరింది. దీంతో పుష్కరఘాట్ మెట్ల నుంచి రోడ్డుపైకి వరద నీరు చేరింది. ఇక కాళేశ్వరం ప్రాజెక్టుకు కొనసాగుతున్న వరద. మేడిగడ్డ బ్యారేజీకి 13.37 లక్షల క్యూసెక్కుల



వరద ప్రవాహం. దీంతో 85 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. దిగువన ఉన్న అన్నారం బ్యారేజీకి 5.11 లక్షల క్యూసెక్కుల వరద ప్రవహం వస్తుండటంతో 66 గేట్లు ఎత్తి 5.11 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కాగా, నిజాం సాగర్ ప్రాజెక్టుకు 20 క్యూసెక్కుల వరద వస్తున్నది. దీంతో అధికారులు నాలుగు గేట్ల ద్వారా వచ్చిన నీటిని వచ్చినట్లే విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 1404.66 అడుగుల వద్ద నీటిమట్టం ఉన్నది. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 1405 అడుగులు. అదేవిధంగా 17.802 టీఎంసీల నీటికిగాను 17.311 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది.




## కటాఫ్ మార్కులపై ముగిసిన కసరత్తు

## కానిస్టేబుల్ ఫలితాల వెల్లడిపై మాత్రం ఉత్కంఠ

హైదరాబాద్ : లక్షలాది మంది అభ్యర్థులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్న ఎస్సై స్థాయి పోస్టుల తుది ఎంపిక ఫలితాల ప్రకటనకు రంగం సిద్ధమైంది. కీలకమైన కటాఫ్ మార్కుల ప్రక్రియను తెలంగాణ రాష్ట్రస్థాయి పోలీస్ నియామక మండలి (టీఎస్ఎల్‌పీఆర్‌బీ) పూర్తి చేసింది. జిల్లాలు, సామాజికవర్గాలు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని ఖాళీ పోస్టులకు అనుగుణంగా ఇటీవలే మండలి అధికారులు ఈ కసరత్తును కొలిక్కితెచ్చారు. తప్పిదాలకు ఆస్కారం లేకుండా చూసే ఉద్దేశంతో ఒకటికిరెండు సార్లు తనిఖీ చేస్తున్నారు. ఇది నామమాత్ర ప్రక్రియ కావడంతో ఎప్పుడంటే అప్పుడు తుది ఫలితాలు ప్రకటించేందుకు మండలి సిద్ధంగా ఉంది. ఈ జాబితా వెలువరించిన అనంతరం అర్హత సాధించిన అభ్యర్థుల గుణగణాలు, ప్రవర్తన, క్రిమినల్ కేసులపై ఆరా తీయనుంది. గరిష్ఠంగా పది రోజుల్లోనే స్పెషల్ బ్రాంచ్ (ఎస్‌బీ) విభాగంతో విచారణ జరిపించిన అనంతరం అభ్యర్థులకు ఎంపిక లేఖలు పంపనుంది. దీన్నిబట్టి ఆగస్టు రెండోవారంలోగా అర్హుల జాబితాను పోలీసు, ఎక్సైజ్, ఫైర్, జైళ్లు.. ఇలా అన్ని విభాగాలకు పంపనుంది. టీఎస్ఎల్‌పీఆర్‌బీ 2022 నోటిఫికేషన్‌కు సంబంధించి 554 ఎస్సై పోస్టుల భర్తీకి దరఖాస్తులను స్వీకరించగా సుమారు 2.47 లక్షల మంది అదృష్టాన్ని పరీక్షించుకున్న సంగతి తెలిసిందే. గతేడాది ఆగస్టు 7న ప్రాథమిక రాతపరీక్షతో నియామక ప్రక్రియ ప్రారంభం కాగా.. సరిగ్గా ఏడాదిలోగా ప్రక్రియను ముగించడం విశేషం.

**జీవో నం.46 వివాదంతో...** ఎస్సై ఎంపిక ఫలితాలు ఏ క్షణమైనా వెలువడే అవకాశమున్నా.. కానిస్టేబుల్ ఎంపిక ఫలితాల వెల్లడి విషయంలో మాత్రం ఉత్కంఠ నెలకొంది. జీవో నం.46కు సంబంధించిన న్యాయవివాదం నడుస్తుండడమే ఇందుకు కారణం. ఈ జీవో రాష్ట్రప్రభుత్వంలోని 9 శాఖలకు సంబంధించిందైనా ప్రస్తుతం హోంశాఖ పరిధిలోని తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక పోలీస్ (టీఎస్ఎస్‌పీ) చుట్టూ కేంద్రీకృతమైంది. కంటీజియస్ జిల్లా కేడర్ పోస్టుల భర్తీ కోసం రూపొందించిన రేషియో కారణంగా తమకు అన్యాయం జరుగుతోందంటూ కొందరు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యంపై ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయనుంది. దీంతో ఎలాంటి తీర్పు వెలువడుతుందోనని అభ్యర్థులు ఎదురుచూస్తున్నారు. టీఎస్ఎస్‌పీకి సంబంధించి ప్రస్తుతం 23 ఎస్సై... 5,010 కానిస్టేబుల్ పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోంది. అయితే ఎస్సై పోస్టులు కంటీజియస్ జిల్లా కేడర్ పరిధిలో లేకపోవడంతో వాటి ఫలితాల వెల్లడిలో సమస్యేమీ లేదు. కానిస్టేబుళ్ల పోస్టులు మాత్రం ఇదే కేడర్‌లో ఉండడంతో న్యాయస్థానం తీర్పు కోసం వేచి చూడాల్సి రానుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే జీవో నం.46 విషయం సాధారణ పరిపాలన శాఖ పరిధిలో ఉండడంతో ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాల్సిన అవసరమేర్పడింది.

## సంపాదకీయం

# అంతా డీకేనే చేస్తున్నారా? కర్ణాటకలో కలకలం వెనుక?

కర్ణాటకలో తెరమీదకు వచ్చిన రాజకీయ కలకలం వెనుక .. చాలా వ్యూహం ఉందని పరిశీలకులు చెబుతున్నారు. ఇంకేముంది.. రాష్ట్రంలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేసేందుకు బీజేపీ బయట రాష్ట్రాల్లో ప్రయత్నాలు చేస్తోందని.. తమ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలను లోబరుచుకునేందుకు ప్రయత్నిస్తోందని ఉప ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నేత డీకే శివకుమార్ వ్యాఖ్యానించారు. అయితే.. ఈ విషయం తనకు తెలియదని సీఎం సిద్దరామయ్య అన్నారు. ఇక, ఈ పరిణామాలను ఒకింత లోతుగా చూస్తే.. అసలు కలకలం బీజేపీ వల్ల కాదని.. కాంగ్రెస్‌తోనేనని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఎందుకంటే.. కాంగ్రెస్ పార్టీఏకంగా 135 స్థానాలు తెచ్చుకుని, బలమైన పార్టీగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్న తర్వాత ఈ సర్కారును కూల్చి వేసే ప్రయత్నం బీజేపీ చేసే అవకాశం లేదని పరిశీలకులు భావిస్తున్నారు. పైగా.. మరో 8 మాసాల్లోనే సార్వత్రిక ఎన్నికలు ఉన్నాయి. తిరిగి మూడోసారి కూడా కేంద్రంలో పాగా వేయాలని చూస్తున్న మోడీకి ఈ పరిణామం శరాఘాతం అవుతుంది. కర్ణాటకలో కనుక బీజేపీ.. దూకుడు పెంచి కాంగ్రెస్ సర్కారును గద్దె దింపితే.. ఏకంగా దేశవ్యాప్తంగా మోడీ ప్రభ మసక బారుతుంది. ఈ నేపథ్యంలో ఇప్పటికిప్పుడు అయితే.. బీజేపీ ఆ పనిచేసే అవకాశం లేదు. ఒక వేళ కర్నాటకలో కాంగ్రెస్‌ను కూల్చేయాలని అనుకున్నా.. ప్రజల్లో ఆ పార్టీపై వ్యతిరేకత పెరిగే వరకు.. వేచి చూస్తుంది. ఇది రాజకీయ వ్యూహం. ఈ నేపథ్యంలో అసలు విషయం.. అంతా ముఖ్యమంత్రి పీఠాన్ని ఆశిస్తున్న డీకేనే ఇలా చేస్తున్నారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ 135 స్థానాల్లో విజయం దక్కించుకోవడం వెనుక.. ఖచ్చితంగా.. డీకే పాత్ర ఉంది. ఈ నేపథ్యంలో ఆయన ముఖ్యమంత్రి కూడా కావాలని అనుకున్నారు. కానీ, అధిష్టానం.. మాత్రం ఆయనకు అవకాశం ఇవ్వలేదు. ఆయనపై కేసులు ఉన్నాయని భావించి తప్పించారు. అయితే.. ఎంతైనా సీఎం సీటుపై ఆశ వదలని డీకేనే ఇలా.. ఏదో తెలియని, లేని కలకలం సృష్టించే ప్రయత్నం చేస్తున్నారన్నది పరిశీలకుల అంచనా. ఏం జరుగుతుందో చూడాలి.

# చెత్త కుప్పలు.. తప్పని తిప్పలు



గోదావరిఖని : రామగుండం నగరపాలికను కొన్ని నెలలుగా 'చెత్త' సమస్య వేధిస్తోంది.. 94 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో 2.5 లక్షల జనాభా కల్గిన రామగుండం నగరపాలికకు ఇప్పటివరకు సొంతంగా డంపింగ్ యార్డు లేకపోవడంతో సమస్య తీవ్రరూపం దాలుస్తోంది. గత ఒకటిన్నర దశాబ్దాలుగా డంపింగ్ యార్డుకు ప్రత్యేకంగా స్థలం కేటాయించాలంటూ ప్రభుత్వాన్ని కోరినప్పటికీ ప్రయోజనం చేకూరడం లేదు. కొన్ని నెలల క్రితం వరకు జీడీకే 11ఎ బొగ్గు గని సమీపంలో సింగరేణి యాజమాన్యం నగరపాలిక డంపింగ్ యార్డు కోసం అనధికారికంగా స్థలాన్ని కేటాయించడంతో కొంత ఉపశమనం కల్గింది. తాజాగా ఆయా ప్రాంతంలో సింగరేణి ఉపరితల గని నిర్మాణం పనులు చేపట్టడంతో అక్కడికి చెత్త తరలింపును సింగరేణి అధికారులు అడ్డుకున్నారు. ఇక అప్పటి నుంచి బల్దియాకు చెత్త సమస్య మొదలైంది.

**కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి**

కొన్నేళ్లుగా డంపింగ్ యార్డుగా వినియోగించిన సింగరేణి స్థలంలో ఉపరితల గని నిర్మాణం పనులు మొదలు కావడంతో చెత్తవేసే పరిస్థితులు లేవు. ఆయా ప్రాంతాల్లో చెత్త వేయడాన్ని సింగరేణి అధికారులు వారిస్తున్నారు. ఇక చేసేది లేక నగరంలో ఎక్కడ ఖాళీ స్థలం కనిపిస్తే అక్కడకు చెత్త తరలిస్తున్నారు. ప్రస్తుతం చెత్త సమస్య తీవ్రమైనప్పటికీ కొన్నేళ్లుగా రామగుండం నగరపాలికను ఈ సమస్య వేధిస్తూనే ఉంది. కొంతకాలం రామగుండం తహసీల్దారు కార్యాలయ సమీపంలోని ఎన్టీపీసీ ప్రహరీ పక్కనున్న ఖాళీ స్థలంలోకి రామగుండం పరిసర ప్రాంతాల్లోని చెత్తను తరలించగా ఎన్టీపీసీ యాజమాన్యం ఖాళీ స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించడంతో అటుగా వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి. కొంతకాలం కుందనపల్లి సమీపంలోని ఖాళీ స్థలంలోకి చెత్తను తరలిస్తుండగా అటవీ శాఖ అధికారులు అడ్డుకున్నారు. తాజాగా సింగరేణి స్థలంలో చెత్త వేయడాన్ని సంస్థ అధికారులు నిరాకరించడంతో కొద్ది నెలలుగా మల్యాలపల్లి, లక్ష్మీపురం సమీపంలోని ఖాళీ స్థలాల్లో చెత్తను తరలిస్తూ వస్తున్నారు. మల్యాలపల్లి సమీపంలో చెత్త వేయడంతో మల్యాలపల్లితో పాటు పరిసర కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని స్థానిక కార్పొరేటర్ కన్నూరి సతీష్‌కుమార్‌తో పాటు స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేశారు. అటువైపు చెత్త ట్రాలీలు, ఆటోలు రాకుండా కందకం తవ్వించారు. దీంతో అటుగా వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి. తాజాగా గురువారం లక్ష్మీపురం, ఎల్కలపల్లిగేటు కాలనీ వాసులు, స్థానిక కార్పొరేటర్ నీల పద్మ చెత్త ట్రాక్టర్లు, ట్రాలీలను అడ్డుకున్నారు. దీంతో ఇకపై అటువైపు చెత్త తరలించే వీల్లేని పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో నగరంలో సేకరించిన చెత్తను ఎక్కడకు తరలించాలో అర్థం కాక పారిశుద్ధ్య విభాగం అధికారులు తల పట్టుకుంటున్నారు. గతంలో రామగుండం సమీపంలో డంపింగ్ యార్డు కోసం ప్రత్యేకంగా స్థలం కేటాయించినప్పటికీ స్థానికుల ఆందోళనలు తీవ్రస్థాయికి చేరుకున్నాయి. దీంతో చెత్త తరలింపును నిలిపివేసి అదే ప్రాంతంలో పట్టణ ప్రకృతి వనాన్ని అభివృద్ధి చేస్తున్నారు.

**ప్రభుత్వం స్పందిస్తేనే పరిష్కారం**

గ్రామ గ్రామాన డంపింగ్ యార్డుల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుండగా రామగుండం నగరపాలికకు మాత్రం చెత్త సమస్య నుంచి విముక్తి కలగడం లేదు. డంపింగ్ యార్డుకు స్థలం కేటాయించాలంటూ కొన్నేళ్లుగా ప్రభుత్వానికి నివేదిస్తుండడం, స్థలం కేటాయించాల్సిందిగా స్థానిక పరిశ్రమల యాజమాన్యాలకు వారు సూచించడం జరుగుతున్నా ఆచరణకు నోచుకోవడం లేదు. రామగుండం నగరపాలిక ప్రాంతంలో అత్యధికంగా పరిశ్రమలకు సంబంధించిన స్థలాలే ఉండడంతో వారు స్పందిస్తే తప్ప రామగుండంలో చెత్త సమస్య తీరే పరిస్థితులు లేవనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇంతకాలంగా ఎలాగోలా నెట్టుకొచ్చినప్పటికీ ఇప్పుడు సమస్య తీవ్రరూపం దాలుస్తోంది. జిల్లా పాలనాధికారి, పురపాలక నిర్వహణ శాఖ, స్థానిక పరిశ్రమల యాజమాన్యాలు స్పందించి రామగుండం నగరపాలికలో చెత్త సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సి ఉంది. నగరపాలక పరిధిలోని పలు కాలనీల్లో ఏర్పాటు చేసిన డస్టుబిన్లలో చెత్త నిండుకుంది. కొన్ని రోజులుగా డస్టుబిన్ల నుంచి చెత్త తొలగించకపోవడంతో కాలనీవాసులు చెత్తను వాటి పక్కన కింద పోస్తున్నారు. దీంతో రహదారుల పక్కన, చుట్టూ పరిసరాల్లో చెత్త వ్యర్థాలు పడి దుర్వాసన వస్తోంది. పట్టణంలోని 1, 20, 21, 22వ డివిజన్లలో ఏర్పాటు చేసిన 10 డస్టుబిన్లు చెత్తతో నిండుకున్నాయి.

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం...**

**– శ్యాంసుందర్, నగరపాలక పారిశుద్ధ్య పర్యవేక్షకులు**

రామగుండంలో డంపింగ్ యార్డు సమస్య తీవ్రంగా ఉంది. కొద్ది రోజులుగా చెత్త తరలింపు ఇబ్బందిగా ఉంది. విషయాన్ని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాం. డంపింగ్ యార్డు కోసం స్థలం కేటాయించాల్సిందిగా కమిషనర్ ప్రభుత్వ యంత్రాంగాన్ని కోరారు. నగరపాలక అధికారులు, పాలకవర్గం తీవ్రంగా కృషి చేస్తున్నారు. త్వరలోనే సమస్య పరిష్కారమవుతుంది.

# నెరవేరని లక్ష్యం..!



భూపాలపల్లి : మహిళలు ఆర్థిక అభ్యున్నతి సాధించేందుకు స్త్రీనిధి ద్వారా తక్కువ వడ్డీకే రుణాలు అందిస్తున్నారు. వాటి ద్వారా ఉపాధి అవకాశాలను ఏర్పాటు చేసుకొని ఆర్థికంగా ఎదగాలనేది ప్రభుత్వ లక్ష్యం. 2022–23 ఆర్థిక సంవత్సరానికి జయశంకర్ జిల్లా వ్యాప్తంగా జిల్లా గ్రామీణాభివృద్ధి లక్ష్యం 66 శాతం మాత్రమే పూర్తయ్యింది. దీంతో అనుకున్న లక్ష్యం నెరవేరలేదు.

**సకాలంలో అందిస్తే ఉపయోగం..**

స్వయం సహాయక సంఘాలకు స్త్రీనిధి రుణాలు సకాలంలో అందిస్తే మహిళలు ఆర్థికంగా స్వయంసమృద్ధి సాధిస్తారు. కిరాణం, టైలరింగ్, దుస్తుల విక్రయ కేంద్రం, వ్యవసాయం, పాడి పశువుల పెంపకం తదితర యూనిట్లు నెలకొల్పేందుకు రుణాలను అందించాల్సి ఉంటుంది. రుణాలు పొందిన స్వయం సహాయక సభ్యులు సకాలంలో రుణాలను చెల్లిస్తే వడ్డీని మాఫీ చేసి ఆయా సంఘాలకు సొమ్మును తిరిగి చెల్లిస్తున్నారు. ఈ క్రమంలో తక్కువ వడ్డీకి రుణాలు సకాలంలో వారికి అందించకపోవడం వల్ల అధిక వడ్డీలకు అప్పు తీసుకుని నష్టపోతున్నారు.

**వందశాతం పూర్తి చేస్తాం**

**పురుషోత్తం, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖాధికారి**

స్వయం సహాయక సంఘాలకు అందించే రుణాలపై ఎప్పటికప్పుడు మండలాల వారీగా సమీక్షిస్తూ లక్ష్యం మేరకు పంపిణీ చేసేలా కార్యాచరణ రూపొందించుకున్నాం. ఈ ఆర్థిక సంవత్సరం అర్హులైన మహిళా సంఘాలకు వందశాతం రుణాలు అందించేందుకు చర్యలు చేపడతాం. స్త్రీ నిధి ద్వారా ఇళ్లు నిర్మించుకునేందుకు రూ.1 లక్ష వరకు రుణాలు అందించేలా ప్రభుత్వ ఆదేశాలు ఉన్నాయి. మహిళలు ఇలాంటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. అలాగే సోలార్ యూనిట్ల ఏర్పాటుకు రుణాలు అందించనున్నాం.

# జోరుగా ఇసుక అక్రమ రవాణా!

కరీంనగర్ : వేసవి ఎండలు ముదురుతున్న నేపథ్యంలో గోదావరినదిలో నీటిమట్టం భారీగా తగ్గి ఇసుక తేలింది. దీంతో ధర్మపురి, బీర్‌పూర్, రాయికల్, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం తదితర మండలాల్లో గత నెల రోజుల నుంచి భారీ ఎత్తున అక్రమార్కులు ఇసుకను నదీతీరం నుంచి కొల్లగొడుతున్నారు. గతంలో కేవలం ట్రాక్టర్ల ద్వారా మాత్రమే తరలించే వారు. ప్రస్తుతం అనధికారికంగా పెద్ద ఎత్తున టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారు. ధర్మపురి వద్ద ఇటీవల నీటి మట్టం గణనీయంగా తగ్గుముఖం పట్టడంతో గతం వారం నుంచి ఇసుక అక్రమ రవాణా ఊపందుకుంది. ధర్మపురి, రాజారం, జైన, దొంతాపూర్, ఆరెపల్లి ప్రాంతాల నుంచి ప్రతిరోజు తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి ఉదయం ఎనిమిది గంటల వరకు వాహనాల ద్వారా జగిత్యాల, కరీంనగర్ తదితర పట్టణాలకు ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. చర్యలు చేపట్టాల్సిన సంబంధిత అధికారులు చూసీ చూడనట్లు వదిలేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కొందరు అక్రమార్కులు నిబంధనలను తుంగలో తొక్కుతూ దళారుల ద్వారా గుట్టుచప్పుడు కాకుండా ఇసుకను తరలిస్తున్నారు. కుప్పలుగా పోసి భారీ వాహనాల్లో తరలిస్తున్నారు. దీనివల్ల గ్రామాల్లో భూగర్భ జలాలు



అడుగంటే ప్రమాదం ఉందని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అంటున్నారు. ఇసుక అక్రమ రవాణాను నిరోధించేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఆయా అంశాలను ధర్మపురి మండల రెవెన్యూ అధికారి వెంకటేష్ దృష్టికి తీసుకువెళ్లగా ఇసుక రవాణాకు తాము ఎలాంటి అనుమతులు ఇవ్వడం లేదన్నారు. ఇసుక అక్రమ రవాణాపై తమ దృష్టికి తీసుకు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

# యథేచ్ఛగా అక్రమబద్ధీకరణ

కరీంనగర్ : ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకొన్న పేదల కోసం ప్రభుత్వం జారీ చేసిన స్థలాల క్రమబద్ధీకరణ ఉత్తర్వులు అక్రమార్కులకు వరంగా మారాయి. ప్రభుత్వ, అసైన్డ్, సీలింగ్ భూములను అన్యాక్రాంతం చేసి రాత్రికి రాత్రే అక్రమంగా నిర్మాణాలు చేపడుతూ క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తులు చేస్తున్నారు.

ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకొని పట్టా హక్కుల కోసం నిరీక్షిస్తున్న నిరుపేదలకు జీవో నెంబరు 58, 59ల ద్వారా కల నెరవేరబోతుందని ఆశిస్తుండగా అక్రమార్కులు స్థానిక నేతల అండదండలతో అ'క్రమ' బద్ధీకరణలకు పాల్పడుతున్నారు. మరోవైపు కొందరు ప్రభుత్వ శాఖల్లోని ఉద్యోగులు అక్రమాలకు తెర తీస్తున్నారనే విమర్శలున్నాయి. మొదట 2014 కంటే ముందు నిర్మించుకున్న వారు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. తాజాగా 2020 వరకు నిర్మించుకున్న వారికి పట్టాలు పంపిణీ చేస్తామని, మీ సేవలో ఏప్రిల్ 30 వరకు దరఖాస్తుకు తుది గడువుగా నిర్దేశించారు. దీంతో దరఖాస్తులు ఇబ్బడిముబ్బడిగా పెరగనున్నాయి. జిల్లాలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో స్వీకరించిన దరఖాస్తుల ఆధారంగా లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోంది. కబ్జాదారుల చేతుల్లో సర్కారు స్థలాలు దారిద్ర్యరేఖకు దిగువన ఉండి, తెల్ల రేషన్ కార్డు కలిగి ఉన్నవారికి 100 గజాల స్థలంలో ఇల్లు ఉంటే జీవో నెంబరు 58లో ఉచితంగా క్రమబద్ధీకరిస్తున్నారు. 100 నుంచి 1000 గజాల వరకు నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్ రుసుం చెల్లించాల్సి ఉంది. జిల్లావ్యాప్తంగా జీవో నెంబరు 58లో 313 మంది దరఖాస్తు చేసుకోగా 151 మందికి, జీవో నెంబరు 59లో 689 దరఖాస్తులకు గాను 664 మందికి పట్టాల కోసం అనుమతి ఇచ్చారు. రామగుండం పరిధిలో నగరపాలక సంస్థ, వైద్య కళాశాల, ఎన్టీపీసీ, మేడిపల్లి, ఆర్ఎఫ్‌సీఎల్, జనగామ, మల్కాపూర్, కుందనపల్లి, గోదావరిఖని ప్రాంతాల్లో ప్రభుత్వ భూములు కొన్ని స్థానిక ప్రజాప్రతినిధుల చేతుల్లో ఉన్నాయి. పెద్దపల్లి రైల్వేస్టేషన్‌కు సమీపంలో, పాలకుర్తి మండలం బసంత్‌నగర్ విమానాశ్రయ పరిధిలో గతంలోనూ ప్రభుత్వ స్థలం పక్కన కబ్జాలకు పాల్పడ్డారు. ఇందులో కొందరు ఇళ్లను నిర్మించుకోగా మిగిలిన వారు హద్దులు పాతుకున్నారు. పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ పురపాలికల పరిధిలోనూ ఖాళీగా ఉన్న ప్రభుత్వ



భూములు స్థిరాస్తి వ్యాపారులు, కబ్జాదారుల చేతుల్లోకి ఎప్పుడో వెళ్లాయి. 2009 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం 75 గజాల చొప్పున స్థానికంగా ఇల్లు లేని, రేషన్ కార్డులున్న పేదలకు ఉచితంగా నివేశన స్థలాలు ఇచ్చి నెంబర్లు వేసి పట్టాలు కూడా అందజేశారు. పట్టాలు అందజేసిన స్థలాల్లో లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోగా మిగిలిన వారు స్తోమతకు తగ్గట్టు పునాదులు నిర్మించడం, రేకులు వేయడం వంటివి చేస్తున్నారు. అసంపూర్తిగా ఉన్న ఇళ్లను పొక్లయిన్లు, కూలీలను ఏర్పాటు చేసి రాత్రికి రాత్రే కూలగొట్టించారు. అడిగిన వారిని బెదిరించడం, రౌడీయిజం చేస్తుండటంతో బాధితులు గతంలో పాలనాధికారిణికి ఫిర్యాదు చేశారు. ఇళ్లు, ఖాళీ స్థలాల క్రమబద్ధీకరణ మూలంగా ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది. మరోవైపు రెవెన్యూ, పుర, నగరపాలక, విద్యుత్తు తదితర శాఖల అధికారులకు, సిబ్బందికి ఈ నిర్ణయం కాసులు కురిపిస్తోంది.

**సమగ్రంగా పరిశీలించి చర్యలు తీసుకుంటాం**

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏప్రిల్ 30 వరకు గడువు ఇచ్చాం. పేదల స్థలాల క్రమబద్ధీకరణ పేరుతో ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఇలాంటి వారిపై ఫిర్యాదులు చేస్తే చర్యలు చేపడతాం. ఈ నెల 30 తర్వాత దరఖాస్తులను మరోసారి సమగ్రంగా పరిశీలించి, సాధ్యాసాధ్యాలు విశ్లేషించి క్షేత్ర స్థాయిలో విచారించాకే కేటాయిస్తాం. లక్ష్మీనారాయణ, అదనపు పాలనాధికారి

# ఆర్టీసీపై తగ్గిన ఇంధన భారం

కరీంనగర్ : ఎక్కువ మొత్తంలో డీజిల్ కొనుగోలు చేసే సంస్థలపై గతేడాది మార్చిలో చమురు కంపెనీలు ధరల భారం మోపాయి. డీజిల్ బల్క్‌గా కొనుగోలు చేసే సంస్థల్లో ఆర్టీసీ ఒకటి. ఇప్పటికే నష్టాల్లో ఉన్న టీఎస్ ఆర్టీసీకి ఇది ఆర్థికంగా మరింత ఇబ్బందిగా మారింది. బయటి బంకుల్లో డీజిల్ ధర తక్కువగా ఉండటంతో సంస్థ బస్సులకు ప్రైవేట్ బంకుల్లోనే ఇంధనం పోయించుకున్నారు. ఇటీవల చమురు సంస్థలు ధరలు తగ్గించడంతో ఆర్టీసీ తన బస్సుల్లో తిరిగి సొంత బంకుల్లోనే ఇంధనం పోయించుకుంటోంది. దీంతో ఆర్టీసీపై రూ.లక్షల్లో భారం తగ్గినట్లైంది.

రీజియన్‌లో..కరీంనగర్ రీజియన్‌లో 885 (ఆర్టీసీ, అద్దె) బస్సులు ఉన్నాయి. రోజూ 3.55 లక్షల కిలోమీటర్లు తిరుగుతాయి. ఉమ్మడి




జిల్లాలో 11 డిపోల పరిధిలో రోజూ 66,500ల లీటర్ల డీజిల్‌ను వినియోగిస్తారు. తాజాగా బల్క్ ధరలు తగ్గించడంతో ఆర్టీసీ చమురు సంస్థల నుంచి నేరుగా ఇంధనం కొనుగోలు చేస్తోంది. ప్రస్తుతం ఆర్టీసీకి రూ.93.07 నుంచి రూ.93.72 పైసలకు డీజిల్ సరఫరా అవుతోంది. దీంతో సంస్థకు రోజుకు రూ.2,52,815, నెలకు రూ.75.84 లక్షలు ఆదా అవుతోంది. గతంలో బయటి బంకుల్లో తక్కువ లీటర్లు పోయించి ఎక్కువ లీటర్లకు బిల్లు తీసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం చమురు సంస్థల నుంచి సంస్థ కొనుగోలు చేస్తూ నేరుగా డిపోల్లోని బంకులకు ట్యాంకర్ల ద్వారా తెప్పిస్తుండగా అక్రమాలకు అడ్డుకట్ట పడనుంది.

**కొంతవరకు ఉపశమనం**

బల్క్ ఇంధన ధరలు తగ్గడంతో ఆర్టీసీకి కొంతవరకు ఉపశమనం లభించినట్లయింది. ప్రస్తుతం ఆర్టీసీ డిపోల్లోనే బస్సులకు డీజిల్ పోస్తున్నాం. దీంతో సంస్థకు ధర పరంగా కలిసిరావడంతో పాటు ట్రాఫిక్ సమస్యలు లాంటివి తగ్గిపోయాయి. గతంలో డిపోల నుంచి బంకులకు అక్కడి నుంచి డిపోకు రావడంలోనూ కొంత వరకు డీజిల్ ఖర్చు అయ్యేది. భీంరెడ్డి, డిప్యూటీ ఆర్ఎం, కరీంనగర్ రీజియన్

# భూ గోక్షస ఏదీ భరోసా!

నల్గొండ : ప్రభుత్వం భూ సంబంధిత వ్యవహారాలను ధరణి పోర్టల్ నుంచి నిర్వహిస్తోంది. రిజిస్ట్రేషన్లతో పాటు వివిధ మార్పులు చేర్పులను ధరణి ద్వారానే చేసుకోవాలి. అయితే కొన్ని భూ సంబంధిత సమస్యలు ధరణిలో పరిష్కారం కాక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మీ సేవా ద్వారా చలాన్లు కట్టి దరఖాస్తు చేసుకుని పత్రాలు, నివేదికలు సమర్పించినా పనులు కావడం లేదని వాపోతున్నారు. అలాగే రద్దు చేసుకున్న, తిరస్కరణకు గురైన దరఖాస్తులకు సంబంధించిన డబ్బులు తిరిగి వారి ఖాతాల్లో జమ కావాల్సి ఉన్నా.. అవి రాకపోవడంతో రైతులు నిరీక్షించాల్సి వస్తోంది. ధరణిలో డీఎస్ పెండింగ్, పేరు, ఇతర తప్పులు సరిదిద్దుకోవడం, విస్తీర్ణంలో హెచ్చుతగ్గుల మార్పులు, ఇతరుల పేరిట తప్పుగా నమోదైతే సంబంధిత ధ్రువపత్రాలు సమర్పించి సరి చేసుకోవడం, తదితర మార్పులు, చేర్పులు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. కొన్ని సమస్యలు పరిష్కారమవుతున్నా, మరికొన్ని సమస్యలు కొలిక్కి రావడం లేదని వాపోతున్నారు. మీ సేవలో దరఖాస్తు చేసుకొని అధికారులకు విన్నవించుకున్నా పరిష్కారానికి నోచుకోవడం లేదని చెబుతున్నారు. దీంతో రైతులు నిరాశకు లోనవుతున్నారు. ధరణిలో నమోదైతే ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు రైతుబంధు లాంటి ప్రయోజనాలు కలుగుతాయని భావిస్తున్న రైతులకు నిరాశే మిగులుతోంది.

రద్దయితే సొమ్ము గోవిందా!

వ్యవసాయ రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుకింగ్ సమయంలో అక్కడే భూముల విలువ ప్రకారం రుసుము చెల్లించి కేటాయించిన తేదీ రోజున తహసీల్దార్ కార్యాలయాలకు వెళ్తారు. అక్కడ ఇరువర్గాల సమక్షంలో రిజిస్ట్రేషన్ చేసుకుంటారు. కొన్నిసార్లు కొనుగోలు,




విక్రయదారుల్లో సయోధ్య కుదరకపోవడం, దస్త్రాల్లో సమస్యలు తదితర కారణాలతో రైతులు రిజిస్ట్రేషన్లు రద్దు చేసుకుంటున్నారు. వారు చెల్లించిన రుసుమును తిరిగి ఖాతాల్లో జమ చేయాలని మీ సేవలో వివరాలను నమోదు చేస్తున్నారు. కానీ రుసుములు మాత్రం తిరిగి రావడం లేదు. వాటి కోసం రైతులు తహసీల్దార్ కార్యాలయాలు, మీ సేవ కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు.

రద్దు చేసుకున్న యజమానులకు..

ధరణి పోర్టల్ ద్వారా వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుక్ చేసుకుని వివిధ కారణాలతో స్లాట్ రద్దు చేసుకున్న యజమానులకు వారు చెల్లించిన చలాన డబ్బును తిరిగి అందచేయాల్సి ఉంటుంది. స్లాట్ రద్దు అయినవారికి ఇప్పటి వరకు డబ్బులు తిరిగి రాలేదు. నల్గొండ జిల్లాలో 1956 మంది, సూర్యాపేటలో 1347, యాదాద్రి భువనగిరిలో 759 మంది ఇప్పటి వరకు స్లాట్ రద్దు చేసుకొని తమకు రావాల్సిన డబ్బుల కోసం నిరీక్షిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో దాదాపు మూడు కోట్ల రూపాయల వరకు స్లాట్ రద్దు చేసుకున్నవారికి ప్రభుత్వం చెల్లించాల్సి ఉన్నట్లు తెలుస్తోంది.

నేరుగా వారి ఖాతాలోకే..వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుకింగ్ చేసుకుని ఆ తర్వాత రద్దు చేసుకున్నవారికి ప్రభుత్వం నేరుగా వారి ఖాతాలోకి చలానా డబ్బులు జమ చేస్తోందని రెవెన్యూ అధికారులు పేర్కొంటు న్నారు. స్లాట్ ఫీజు ప్రభుత్వ ఖజానాలో జమ అవుతుందని, తిరిగి డబ్బు అక్కడి నుంచి స్లాట్ రద్దు చేసుకున్న వారికి చేరుతుందని తెలిపా రు. తిరిగి చెల్లించడంలో అధికారులకు సంబంధం లేదని పేర్కొంటున్నారు.

# కబ్జాకోరల్లో చెరువులు

నల్గొండ : జిల్లాలో ఆయా గ్రామాల్లో చెరువులు, కుంటలు ఆక్రమణలకు గురవుతున్నా యంత్రాంగం చూసీ చూడనట్లు వ్యవహరిస్తోంది. భూముల ధరలు పెరడంతో ఆక్రమణదారులు వీటిపై కన్నేస్తున్నారు. ఉదాహరణకు.... గుర్రంపోడు మండలంలోని మక్కపల్లి గ్రామపంచాయితీ పరిధిలోని వీటీనగర్‌లోని సాకలోనిబాయి కుంట ఆక్రమణకు గురైంది. నీటిపారుదలశాఖ పరిధిలో 116 సర్వేనెంబరులో 3.06 ఎకరాల లోతట్టు ప్రాంతం ఉన్న చిన్న కుంట ఇది. ఎగువన వచ్చే వరదనీటిని ఒడిసిపట్టి భూగర్భజలాలు పెంచేందుకు ఉద్దేశించిన ఈ చెరువు గత ఏడాది వరకూ నిక్షేపంగా ఉంది. దీనికి దిగువన ఉన్న వ్యవసాయబావుల్లో నీటిమట్టం గణనీయంగా ఉండేది. అయితే భూముల విలువలు పెరగడంతో బావులకింది ఆయకట్టు రైతులే కొందరు ఈ 3 ఎకరాలను ఆక్రమించి పత్తి సాగుచేస్తున్నారు. ప్రస్తుతం మట్టి కట్ట మాత్రమే మిగిలింది. అది కూడా చదునుచేయడంతో ఆనవాళ్లు కోల్పోయింది.

నాగార్జునసాగర్ నియోజకవర్గంలో..పదేళ్ల కిందటి వరకూ నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని ఆరుమండలాల్లో సుమారు అయిదొందలకు పైగా చిన్నచెరువులు, కుంటలు నీటివనరులకు ఉండేవి. వీటిలో మూడొందలకు పైగా రెవెన్యూ శాఖ నక్షాలో, నీటిపారుదలశాఖ నమోదులో ఉండేవి. వాటిలో చాలావరకు కబ్జాలకు గురవ్వగా, మరికొన్ని పట్టాలే మారిపోయాయి. కొందరు భూములున్నవారే వీటినీ కూడా ఆక్రమించేసుకుని రెవెన్యూ యంత్రాంగంతో పట్టా రాయించుకున్నారు. ప్రస్తుతం అక్కడొకటి ఇక్కడొకటి కుంటలు మిగిలినా వాటిని కూడా మాయం చేస్తున్నారు. చాలావరకు చెరువుల్లో శిఖం భూములు కబ్జాకోరల్లోనే మగ్గుతున్నాయి. అధికారులు చూసీ చూడనట్లు ఉండటంతో ఈకబ్జాల పరంపరకు అడ్డుకట్ట పడటంలేదు. కబ్జాలో చిక్కుకున్న చెరువులకు మరికొన్ని ఉదాహరణలు... వీటీనగర్ ఎగువన ఉన్న మక్కపల్లిచెరువు లోతట్టు ప్రాంతం సుమారు 50 ఎకరాలు ఉండగా అందులో ఇప్పటికే పదెకరాల వరకూ కబ్జా చేశారు. మరో ఏడాదిలో ఇందులో సగం చెరువు మాయమయ్యే ప్రమాదం ఉ ందని చెబుతున్నారు. పోచంపల్లి పరిధిలోని మాధవరావు చెరువు శిఖం భూమి ఐదెకరాల వరకూ కబ్జాకు గురైంది.

కొప్పోలు పరిధిలోని తాటిచెరువులో శిఖంభూమి ఆక్రమణలకు గురైంది. గుర్రంపోడు మండలంలోని పెద్దదైన మొసంగి పెద్దచెరువు శిఖం భూమి సైతం ఆక్రమణలకు గురైంది. ఇందులో చేపల చెరువును ఏర్పాటుచేసుకున్నట్లు సమాచారం.

# ఉపరితల గనుల్లో.. స్తంభించిన బొగ్గు ఉత్పత్తి!



సింగరేణి : సింగరేణిపై వర్షాలు తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. ఉపరితల గనుల్లోకి నీరు చేరడం, రహదారులు బురదమయం కావడంతో భారీ వాహనాలు వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఫలితంగా బొగ్గు ఉత్పత్తి గణనీయంగా పడిపోయింది. కుండపోతగా కురుస్తున్న వర్షాలతో గనుల్లో భారీగా వరద నీరు చేరింది. మోటార్ల ద్వారా తోడుతున్నా ఫలితం కనిపించడం లేదు. వర్షం కురవడం ఆగిపోయిన వెంటనే రహదారులను మెరుగుపర్చేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మళ్లీ వర్షం కురువకుంటే యంత్రాలను నడిపించవచ్చని భావిస్తున్నారు. ఐదు రోజులుగా అధికారులు శ్రమిస్తున్నా ఏకధాటిగా కురుస్తున్న వానలతో రోడ్లు ఎండేంత పరిస్థితి కనిపించడం లేదు. యంత్రాలను ఉపరితలంలో పార్కింగ్ యార్డుల్లో నిలిపివేశారు. ఉద్యోగులు విధులకు హాజరవుతున్నా పని పరిస్థితులు అనుకూలించకపోవడంతో విధుల సమయం ముగిసే వరకు గనిపైనే ఉండి ఇంటికి రావాల్సిన పరిస్థితి ఏర్పడింది.

యార్డుల్లోని బొగ్గు రవాణా వర్షాకాలం యాజమాన్యం ఉపరితల గనుల్లో ఉత్పత్తి లక్ష్యాన్ని కుదించుకుంటోంది. వేసవిలో ఎండతాకిడిని తట్టుకుంటూ అధికోత్పత్తికి కృషి చేస్తూ కొంత బొగ్గును ఉపరితలంలో డంప్ యార్డుల్లో నిల్వ చేస్తుంటారు. ప్రస్తుతం ఉత్పత్తిని మించి యాజమాన్యం బొగ్గు రవాణా చేయగల్గుతుందంటే.. నిల్వ బొగ్గును తరలించడమే కారణం.

తేమ లేకుండా ఉంటేనే..

100 టన్నుల సామర్థ్యం ఉన్న డంపర్లు క్వారీలో నడవాలంటే అంతర్గత రహదారులు తేమ లేకుండా ఉంటేనే సాధ్యమవుతుంది. వర్షాకాలంలో రోడ్లు బురదమయం కావడంతో ఏర్పడే ఇబ్బందులతో పాటు, వాతావరణంలో ఉండే తేమ, పొగతో రాత్రి వేళల్లో ఫ్లడ్‌లైట్ల వెలుతురుపై ప్రభావం పడుతుంది. భారీ వాహనాల వైపర్లు సక్రమంగా పనిచేయకున్నా ఆపరేటర్లకు ఇబ్బందులు ఏర్పడుతుంటాయి. వీటన్నింటినీ అధిగమిస్తూ బొగ్గు ఉత్పత్తి చేయడం కత్తిమీద సాములా ఉంటోంది. వాతావరణం పొడిగా ఉన్నప్పుడు మాత్రమే ఉపరితల గనుల్లో పేలుడు పదార్థాలను ఉపయోగించాల్సి ఉంటుంది. బొగ్గు, మట్టి వెలికితీయడానికి వాడే పేలుడు పదార్థాలు వర్షాకాలంలో అనుకోకుండా ఉరుములు, మెరుపులు వస్తే వెలువడే విద్యుత్తు తరంగాలకు అవి పేలిపోయే ప్రమాదం ఉంటుంది.

# పార్కింగ్ కాంప్లెక్సులేవీ?



సిరిసిల్ల : సిరిసిల్ల పట్టణ ప్రజలు పార్కింగ్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. జనావాసాలు, కార్యాలయాలతో పాటు ముఖ్యంగా వాణిజ్య భవనాల ఎదుట పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. పార్కింగ్‌కు స్థలం లేదని ఇబ్బంది పడుతున్న లోపే చలానా మోత మోగుతోందంటూ వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేటు ఆసుపత్రులు, వాణిజ్య భవనాల ఎదుట ఈ సమస్య ఎక్కువగా ఉందని వాపోతున్నారు. వాణిజ్య భవనాలన్నింటికీ సంబంధిత యజమాని పార్కింగ్ సౌకర్యం కల్పించకపోవడంతో రోడ్లపై వాహనాలు పెట్టాల్సిన దుస్థితి నెలకొంది. భవనాల నిర్మాణానికి అనుమతులు ఇచ్చే సమయంలో గానీ, నిత్య పర్యవేక్షణలో గానీ మున్సిపల్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం వల్లే ఇలాంటి ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆరోపిస్తున్నారు. ప్రైవేటు ఆసుపత్రులు, ఇతర వాణిజ్య భవనాల నిర్మాణాలకు ముందుగా పార్కింగ్ స్థలం చూపిస్తేనే మున్సిపల్ అధికారులు అనుమతులు ఇవ్వాల్సి ఉంటుంది. అయితే ఈ నిబంధనలను పాటించడం లేదు. పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రులు, వాణిజ్య భవనాలు, దుకాణాలు కచ్చితంగా పార్కింగ్ స్థలం చూపించాల్సి ఉంటుంది. సిరిసిల్లలోని రద్దీ ప్రాంతాలైన పాత బస్టాండ్, గాంధీచౌక్, అంబేద్కర్ చౌక్ వద్ద ప్రజలకు పార్కింగ్‌కు అవస్థలు తప్పడం లేదు.

సెల్లార్ సౌకర్యం ఉన్నా..

కొన్ని వాణిజ్య భవనాలకు పార్కింగ్ కోసం సెల్లార్ సౌకర్యం ఉన్నప్పటికీ అవి వ్యాపార వ్యవహారాలకు వినియోగిస్తున్నారు. మున్సిపల్ అధికారులు నోటీసులు పంపించినా ఎలాంటి ఫలితం ఉండటం లేదు. వాణిజ్య భవనాలున్న కొందరు ప్రజాప్రతినిధులు, పలుకుబడి ఉన్నవారికి నోటీసులు పంపి ఏళ్లు గడుస్తున్నాయని, అయినప్పటికీ వారి నుంచి స్పందన ఉండటం లేదు. ఇటువంటి వారిపై మున్సిపల్ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని, అదే సామాన్యులైతే వెంటనే చర్యలు తీసుకుంటున్నారని పలువురు వాపోతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేటు ఆసుపత్రులకు వస్తున్న ప్రజల వాహనాలను ఎక్కడ నిలుపుకోవాలనే విషయాన్ని మాత్రం స్పష్టంగా తెలపడం లేదు. పలు ఆసుపత్రులు ఫుట్పాత్‌లనే పార్కింగ్ స్థలాలుగా వినియోగించుకుంటున్నాయి. అయినప్పటికీ మున్సిపల్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. సిరిసిల్ల పురపాలక సంఘం పరిధిలో వాణిజ్య భవనాలు 1,458 ఉన్నాయి. పార్కింగ్ ఉన్నప్పటికీ వినియోగించుకోని 22 భవనాలకు ఇప్పటివరకు నోటీసులు పంపించినట్లు మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. అధికారుల ఉదాసీనత కారణంగా ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

సిరిసిల్లలో వాణిజ్య భవనాల నిర్మాణ సమయంలో పార్కింగ్ వసతి చూపిస్తేనే అనుమతిస్తున్నాం. పట్టణ ప్రణాళిక అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తూ పార్కింగ్ వసతి లేని వాటికి, సెల్లార్ ఉన్నా వినియోగించని వారికి నోటీసులు ఇస్తున్నారు. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవు.సమ్మయ్య, కమిషనర్, పురపాలక సంఘం

# నియంత్రణ కరవు.. ప్రమాదాలకు నెలవు

కోరుట్ల: కోరుట్ల పట్టణంలోని ప్రధాన రహదారిపై నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రెండేళ్ల కిందట పట్టణంలోని గౌతమ్ మోడల్ స్కూల్ నుంచి జీఎస్ గార్డెన్ వరకు సుమారు 4 కిలో మీటర్ల పొడవునా రోడ్డు విస్తరణ చేపట్టారు. రోడ్డు మధ్యలో డివైడర్లను నిర్మించి హైమస్ట్‌లైట్లు, పచ్చని చెట్లు ఏర్పాటు చేశారు. డివైడర్లకు ఇరువైపులా తారురోడ్డును నిర్మించారు. నందిచౌక్, కల్లూర్‌రోడ్ క్రాసింగ్ వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయించారు. రోడ్డుపైనున్న ట్రాఫిక్ సిగ్నల్స్‌ను పాటించి వాహనాల రాకపోకలు సాగించక ఇష్టం వచ్చినట్లు వాహనాలను నడుపుతున్నారు. దీంతో ఇతర వాహనదారులకు రోడ్డు దాటడం ఇబ్బందికరంగా మారింది.

దెబ్బతింటున్న డివైడర్లు

చాలాచోట్ల రోడ్డును దాటేందుకు డివైడర్ల మధ్యలో అక్కడక్కడ స్థలం విడిచిపెట్టారు. వాహనదారులు రోడ్డును క్రాస్ చేసేటప్పుడు ఇరువైపులా చూసి నడిపించాల్సి ఉండగా ఎదురుగా వచ్చిన వాహనాలను గమనించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఝాన్సిరోడ్, ఇందిరారోడ్, కల్లూర్‌రోడ్, డైమండ్ హొటల్ వద్ద రోడ్డుకు ఎడమ వైపు నుంచి వాహనాలు నడపాల్సి ఉండగా నిబంధనలకు విరుద్ధంగా కుడివైపు వాహనాలను తీసుకెళ్లడంతో ఎదురుగా వచ్చే వాహనాదారులు ఇక్కట్లకు గురవుతున్నారు. పట్టణంలో 40 కి.మీ వేగంతో వాహనాలు నడపాల్సి ఉండగా భారీ వాహనాలు, ట్రాక్టర్‌లు, ఇతర వాహనాలు వేగంగా నడుపుతున్నారు. దీంతో కొత్తబస్టాండ్ వద్దనున్న అంబేద్కర్ విగ్రహం గద్దెకు, నందిచౌక్, ఇతర చాలాచోట్ల డివైడర్లకు ఢీకొట్టడంతో అవి దెబ్బతిని కూలిపోతున్నాయి.

కూడళ్ల ఏర్పాటులో జాప్యం



పట్టణంలో అంబేద్కర్‌చౌక్, కార్గిల్‌చౌక్, నందిచౌక్ వద్ద కూడళ్ల ఏర్పాటు కోసం సుమారు 5 ఏళ్ల కిందట మున్సిపల్ అధికారులు ప్రత్యేక నిధులను కేటాయించారు. ఇప్పటివరకు కూడళ్లను ఏర్పాటు చేయకుండా తీవ్ర జాప్యం చేస్తున్నారు. రహదారిపై చాలాచోట్ల రోడ్డు మధ్యలో రద్దీని నియంత్రించేందుకు ట్రాఫిక్ పోలీసులు నిలబడేందుకు మున్సిపల్ ఆధ్వర్యంలో ప్రత్యేక స్టాండ్‌లు ఏర్పాటు చేయించారు. కానీ అందులో ఎప్పుడు ట్రాఫిక్ పోలీసులను ఉంచకపోవడంతో అవికాస్తా నిరుపయోగంగా మారాయి. ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేసిన కొత్తలో పోలీస్ సిబ్బంది నిబంధనలను అతిక్రమించిన వారికి జరిమానాలు విధించారు. సిబ్బంది కొరతతో సిగ్నల్ వద్ద పోలీసుల లేకపోవడంతో ఇష్టం వచ్చినట్లు వాహనాలు నడుపుతున్నారు.

# పట్టాభిషేకానికి వేళాయె..!

నల్గొండ : నల్గొండ మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం మూడో స్నాతకోత్సవం ఆగస్టు నెలలో నిర్వహించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. 2007లో ప్రారంభమైన ఈ వర్సిటీ ఇప్పటి వరకు రెండుసార్లు స్నాతకోత్సవం జరుపుకుంది. మొదటి కాన్వకేషన్ వేడుకలకు అప్పటి గవర్నర్ నరసింహన్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు డిగ్రీ పట్టాలు అందజేశారు. ఈసారి నిర్వహించే స్నాతకోత్సవంలో ప్రస్తుత గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ పాల్గొనే అవకాశం ఉందని వర్సిటీ అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికే డిగ్రీ పట్టాల కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు ప్రత్యేక నోటిఫికేషన్‌ను వర్సిటీ పరీక్షల విభాగం కార్యాలయం విడుదల చేసింది. బంగారు పతకాలు సాధించిన విద్యార్థుల జాబితాను సైతం వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. మూడో కాన్వకేషన్‌ను ఘనంగా నిర్వహించేందుకు వర్సిటీ ఉన్నతాధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

40 మంది విద్యార్థులకు బంగారు పతకాలు..

కాన్వకేషన్‌లో 2018-19, 2019-20, 2020-21 విద్యా సంవత్సరాల్లో ఆయా కోర్సుల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు బంగారు పతకాలు అందజేయనున్నారు. ఎంఏ ఆంగ్లం, ఎంఏ ఎకనామిక్స్, ఎంకాం, ఫ్యాకల్టీ ఆఫ్ సైన్సెస్, ఎంఎస్సీ కెమిస్ట్రీ, ఎంఎస్సీ గణితం, ఎంఎస్సీ బయోటెక్నాలజీ, ఎంఎస్సీ ఇంటిగ్రేటెడ్ ఫార్మస్యూటికల్ కెమిస్ట్రీ, ఎంబీఏ ఫైనాన్స్, ఎంసీఏ, బీకాం జనరల్, కంప్యూటర్స్, కంప్యూటర్ అప్లికేషన్స్ కోర్సుల్లో మొత్తం 40 మంది విద్యార్థులు బంగారు పతకాలను స్నాతకోత్సవ వేడుకల్లో పతకాలు




అందుకోనున్నారు. వీరితో పాటు వర్సిటీలో పీహెచ్‌డీలు పూర్తిచేసిన విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేయనున్నారు.

ఎదురు చూస్తున్నాను: మౌనిక

నేను ఎంజీయూలో 2021లో ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ ఫార్మస్యూటికల్ కెమిస్ట్రీ కోర్సు పూర్తిచేశాను. 9.37 జీపీఏతో ఉత్తీర్ణత సాధించాను. తాజాగా విడుదల చేసిన ఎంజీయూ బంగారు పతకాల విజేతల జాబితాలో నా పేరు చూసుకుని ఎంతో ఆనందపడ్డాను. వర్సిటీలో అడుగుపెట్టిన నాటి నుంచే కష్టపడి చదివాను. పరీక్షల సమయంలో సమయాన్ని వృథాచేసుకోకుండా పుస్తకాలకే పరిమితమయ్యాను. అత్యుత్తమ ఫలితాలు సాధించేలా వర్సిటీ అధ్యాపకులు ఇచ్చిన సలహాలు, సూచనలు మరువలేనివి. వర్సిటీ చదువు ఎంతో బాగుంది. త్వరలో గవర్నర్ చేతులమీదుగా బంగారు పతకం అందుకోనుండడం నా అదృష్టంగా భావిస్తున్నాను. ఆ క్షణం కోసం వెయ్యికళ్లతో ఎదురుచూస్తున్నాను.ఏర్పాట్లు చేస్తున్నాంఆచార్య గోపాల్‌రెడ్డి, ఎంజీయూ వీసీ

మూడో కాన్వకేషన్‌ను ఆగస్టులో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ వేడుకల్లో వివిధ కోర్సుల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన సుమారు 40 మందికి బంగారు పతకాలు, పీహెచ్‌డీ పూర్తిచేసిన వారికి పట్టాలను అందజేయనున్నాం. డిగ్రీ పట్టాల కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. విశ్వవిద్యాలయాన్ని దశల వారీగా అభివృద్ధి చేసుకుంటూ వస్తున్నాం. ఇటీవలనే వర్సిటీకి న్యాక్ నుంచి బీప్లస్ గ్రేడ్ లభించింది. భవిష్యత్తులో మెరుగైన గ్రేడ్ సాధన కోసం కృషి చేస్తాం. త్వరలో నిర్వహించే కాన్వకేషన్ విజయవంతంకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి.

# పెట్టుబడుల పేరిట ముంచిన ఆన్‌లైన్ యాప్

నల్గొండ : అమాయకులైన ప్రజలకు మాయ మాటలు చెప్పి ఆన్‌లైన్ యాప్ ద్వారా మోసగించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఒకటికి నాలుగు రెట్లు డబ్బులు వస్తాయని చెప్పడంతో నమ్మి నిండా మునిగారు. మండలంలోని అర్వపల్లి, రామన్నగూడెం, వేల్పుచర్ల తదితర గ్రామాల ప్రజలు సుమారు రూ.3 కోట్లకు పైగానే నష్టపోయినట్లు సమాచారం. ఈ విషయాన్ని చెప్పేందుకు, పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. పిలిప్స్ అనే యాప్ ద్వారా ఆరు నెలల నుంచి ఈ తంతు నడుస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో 45, 60 రోజుల స్కీంలు ఉన్నాయి. యాప్‌లో రూ.50 వేలు పెట్టుబడి పెడితే రోజుకు రూ.4 వేల చొప్పున 45 రోజులు వస్తాయని నమ్మబలికారు. మొదట్లో రూ.1000 నుంచి రూ.5 వేలు పెట్టివారికి బాగానే తిరిగి వచ్చాయి. డబ్బులు వస్తున్నాయని ఒకరి నుంచి ఒకరికి తెలియడంతో లక్షల రూపాయలు సంపాదించవచ్చని పెట్టుబడి పెట్టిన వారికి కన్నీరే మిగిలింది. ఈ నెల 19వ తేదీన పిలిప్స్ యాప్‌ను నిలిపి వేశారు. ఆ రోజు నుంచి ప్రజల్లో ఆందోళన



మొదలైంది. బయటికి చెప్పలేక మనోవేదన చెందుతున్నారు.

వేల్పుచర్లలో రూ.2 కోట్లకు పైనే...!

వేల్పుచర్ల చిన్న గ్రామమైనప్పటికీ 130 మంది వరకు రూ.2 కోట్లకు పైగానే పెట్టుబడి పెట్టినట్లు సమాచారం. అర్వపల్లిలో 30 నుంచి 50 మంది, రామన్నగూడెంలో 20 మందికి పైగానే బాధితులున్నారు. అర్వపల్లిలో రూ.50 లక్షలకు పైగానే కట్టి నష్టపోయారు. యాప్ నిర్వహించే వారు ఇప్పటికీ డబ్బులు వస్తాయి అని నమ్మబలుకుతుండటంతో ఇతరులకు చెప్పలేక, ఫిర్యాదుకు ముందుకురాక మదనపడుతున్నారు. 'ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు, బాధితులు ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామ'ని ఎస్సై అంజిరెడ్డి తెలిపారు.

# సెగ్రిగేషన్ యార్డులు నిరుపయోగం

వరంగల్ : గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ప్రభుత్వం ప్రతి పంచాయతీకి సెగ్రిగేషన్ యార్డులను మంజూరు చేసింది. ఇంటింటి నుంచి చెత్తను సేకరించేందుకు శ్రీకారం చుట్టింది. తడి వ్యర్థాలను యార్డుకు తరలించి ఎరువుల తయారు చేయడానికి నిర్ణయించారు. మొదట్లో బాగానే అమలైనా క్రమంగా తూతూ మంత్రంగా కొనసాగడంతో రూ.లక్షలు వెచ్చించి చేపట్టిన నిర్మాణాలు నిరుపయోగంగా మారాయి. జిల్లాలోని సెగ్రిగేషన్ యార్డుల తాజా పరిస్థితులపై కథనం

నిర్వహణ అస్తవ్యస్తం

పంచాయతీలను చెత్త రహితంగా తీర్చిదిద్దేందుకు నాలుగేళ్ల క్రితం వీటిని ఏర్పాటు చేశారు. అందులో భాగంగా ఇంటింటికి వెళ్లి తడి, పొడి చెత్త సేకరణ ప్రారంభించారు. సేకరించిన చెత్తను ట్రాక్టర్లు, ఆటోల్లో సెగ్రిగేషన్ యార్డుకు తరలించి తడి చెత్తతో సేంద్రియ ఎరువు




తయారు చేసి రైతులకు విక్రయించడం, పొడి చెత్తను వేలంపాట ద్వారా విక్రయించి పంచాయతీకి ఆదాయం వచ్చేలా కార్యాచరణ రూపొందించారు. మొదట్లో ఉత్సాహంగా పకడ్బందీగా అమలు చేశారు. చెత్తను ఎక్కడబడితే అక్కడ పారవేయకుండా సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారి నుంచి అపరాధ రుసుం వసూలు చేశారు. దీంతో గ్రామీణ వీధులు పరిశుభ్రంగా మారాయి. అనంతరం చెత్త సేకరణ, ఎరువుల తయారుపై నిర్లక్ష్యం మొదలైంది. 80 శాతం పంచాయతీల్లో పాలకులు పట్టించుకోవడం లేదంటే అతిశయోక్తి కాదు. సేకరించిన చెత్త డంపింగ్ యార్డులకు చేరవేస్తున్నారు. అధిక శాతం పంచాయతీల్లో కంపోస్టు షెడ్లలో వ్యర్థాలను విభజించే పనులు జరగడం లేదు. చెత్తను ఒకే చోట కుప్పగా పోసి చేతులు దులుపుకుంటున్నారు. జిల్లాలోని 12మండలాల్లో 275 గ్రామాల్లో ఉపాధి హామీ పథకం నిధులతో కంపోస్టుషెడ్లు నిర్మించారు. ఒక్కోదానికి రూ. 2.5లక్షల వ్యయం చేశారు. తడి పొడి చెత్తను వేరు చేసేందుకు ప్రత్యేకంగా అరలు ఏర్పాటు చేశారు. చాలా గ్రామాల్లో సేకరించిన చెత్తను గ్రామ శివారులో ఏదో ఒక చోట డంప్ చేసేస్తున్నారు.

# దోమలు ముసురుతున్నాయ్!

భూపాలపల్లి : వారం రోజులుగా వీడని వానలు.. పరిసరాలు అంతా తడిగా ఉండటంతో దోమలు ముసురుతున్నాయ్.. వానాకాలం సీజన్‌లో వచ్చే అనారోగ్య సమస్యల్లో దోమకాటుతో వచ్చేవే ఎక్కువగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రజలు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీ పరిధిలో దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి.. ప్రజలు కూడా పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ.. జాగ్రత్తలు తీసుకోవాలి.

ఇంటి శుభ్రత కీలకం..

ఇళ్లలో నీటి నిల్వ పాత్రలపై మూతలు పెట్టి దోమల పెరుగుదలకు ఆస్కారం లేకుండా చూసుకోవాలి.. ఇంట్లో, ఇంటి బయటి పరిసరాల్లో పరిశుభ్ర వాతావరణం ఉండేలా చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలి. ఉదయం, సాయంత్రం సమయంలో ఎక్కువ మొత్తంలో దోమలు ఇళ్లలోకి ప్రవేశించి మూలలు, చీకటి ప్రదేశాల్లో దోమలు నక్కి రాత్రి సమయంలో మనుషులపై దాడి చేస్తాయి. ఖాళీ స్థలాలు, ఇతర ప్రాంతాల్లో నిలిచిన నీటిని తొలగించాలి. రోజుల తరబడి నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్‌బాల్స్ లాంటివి వేసి దోమను అరికట్టాలి.

పాలకవర్గాల పట్టింపేదీ?

గ్రామాల్లో దోమల నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో అపరిశుభ్ర వాతావరణం నెలకొని దోమలు పెరిగిపోతున్నాయి. పంచాయతీ కార్మికులు సమ్మెలో ఉండటంతో గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు పడకేశాయి. గ్రామాల్లో అపరిశుభ్ర వాతావరణం పెరిగిపోయి దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. నీరు నిల్వ ఉన్న చోట, అపరిశుభ్రత ఉన్నటువంటి ప్రదేశంలో బ్లీచింగ్ పౌడర్ చల్లాల్సి ఉంటుంది. భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో అప్పుడప్పుడు మాత్రమే ఫాగింగ్ చేస్తున్నారు. హైపోక్లోరైడ్ ద్రావణాన్ని నీరునిల్వ ఉండే ప్రదేశాల్లో చల్లాల్సి ఉంటుంది. జిల్లా వ్యాప్తంగా ఎలాంటి నియంత్రణ చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలు దోమకాటుకు గురవుతున్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే కార్యక్రమాలు నిర్వహించి ఇళ్లలో నీరు నిల్వ ఉన్న పాత్రలు, ప్రదేశాలను గుర్తించి తొలగించేలా ప్రజలకు సరైన అవగాహన కల్పించడంలో సంబంధిత అధికారులు విఫలమవుతున్నారు. ప్రధానంగా మలేరియా, డెంగీ, గన్యా, ఫైలేరియా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుంది.

ఈ జాగ్రత్తలు తీసుకోవాలి..

ప్రతి శుక్రవారం డ్రై డే పాటిస్తూ నీటి నిల్వ ప్రాంతాలను గుర్తించి వాటిని తొలగించాలి. కాలువల్లో చెత్త, వ్యర్థాలు వేయకుండా చూడాలి. దోమలు ఇంట్లోకి రాకుండా కిటికీలకు జాలీలను ఏర్పాటు చేయాలి.. సాయంత్రం 6 గంటల సమయంలో దోమలు ఇళ్లల్లోకి వచ్చే అవకాశాలు ఉంటాయి. ఆ సమయంలో తలుపులు మూసివేయాలి. వానాకాలంలో కొత్త నీరు చేరుతుంది. దీంతో నీటి కాలుష్యం ఏర్పడే అవకాశాలు ఎక్కువ.. డయేరియా, టైఫాయిడ్, కామెర్లు తదితర వ్యాధులు సోకే అవకాశం ఉంటున్నందున కాచి చల్లార్చి తాగాలి. తరచూ చేతులను శుభ్రంగా కడుక్కోవాలి. భోజనానికి ముందు చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవడం ద్వారా అతిసారం, ఇతర సీజనల్ వ్యాధులను అరికట్టవచ్చు. నిల్వ నీటిలో టైగర్ దోమ వృద్ధి చెందుతుంది. దీని కాటుతో డెంగీ బారినపడే అవకాశం ఉంటుంది. తీవ్రమైన జ్వరం, తలనొప్పి, వాంతులు, విరేచనాలు తదితర లక్షణాలు కనిపిస్తాయి. వణుకుతో కూడిన జ్వరం, రోజు విడిచి రోజు జ్వరం రావడం తలనొప్పి, ఒంటి నొప్పులు, తదితర లక్షణాలు మలేరియా వ్యాధిలో కనిపిస్తాయి. మురుగు నీటిలో పెరిగే ఆడ అనాఫిలస్ దోమ ద్వారా మలేరియా ప్రబలే ప్రమాదం ఉంటుంది.వానాకాలం మాంసాహారం జోలికి వెళ్లకూడదు. ఈగలు మాంసంపై చేరడం, అలాగే సరిగా ఉడకనటువంటి తీసుకోవడంతో వ్యాధుల బారినపడతారు.

# రియల్ జీవితాన్ని కదిలించే రీల్స్



ఇల్లెందు : సోషల్ మీడియాలో గుర్తింపు పొందేందుకు చూపిన ఉత్సాహమే ఓ యువతి పాలిట మరణశాసనమైంది. ఎంతో ఆసక్తితో ఆమె చేసే 'రీల్స్' అన్నకు నచ్చలేదు. సమస్యను చెల్లెలికి అర్థమయ్యే రీతిలో చెప్పడంలో అతడు విఫలమవగా.. ఆపై పట్టరాని కోపంతో ఆమెను అంతమొందించిన ఉదంతం తాజాగా ఇల్లెందు మండలంలో చోటుచేసుకుంది. స్మార్ట్‌ఫోన్ ప్రపంచంలో ఒక్కొక్కరిది ఒక అభిరుచి. నలుగురిలో ప్రత్యేకంగా నిలవాలన్న కోరిక కొందరికి సమస్యలు తెచ్చిపెడుతోంది. కుటుంబాల్లో చిచ్చు రేపుతోంది. తాజాగా యువతి వైఖరి నచ్చని సోదరుడు ఆమెను హతమార్చి కటకటాల పాలయ్యాడు. అలవాటేదైనా హద్దుల్లోనే ఉండాలని, వ్యసనంగా మారితే పర్యవసానాలు ఎదుర్కోక తప్పదని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

విపరీత ధోరణులతో సమస్య

స్మార్ట్‌ఫోన్ వాడే ప్రతి పది మంది యువతలో ఐదుగురు సోషల్ మీడియాలో వస్తున్న రీల్స్, ఇతర వీడియోలకు ఆకర్షితులవుతున్నారు. వారూ ఆ దిశగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇంతటితో తృప్తిపడకుండా సబ్‌స్క్రైబ్స్ పెంచుకోవాలని, ఫాలోవర్స్ పెరగాలని విపరీతంగా రీల్స్ చేస్తున్నారు. ఈ వ్యామోహమే జీవిత లక్ష్యం పక్కదారి పట్టేందుకు, సమస్యలు తెచ్చిపెట్టేందుకు కారణమవుతోంది.

కొవిడ్ తర్వాత సామాజిక మాధ్యమాల వినియోగం బాగా పెరిగింది. ఇన్‌స్టాగ్రాం, షేర్‌చాట్, యూట్యూబ్ తదితర సామాజిక మాధ్యమాల్లో రీల్స్ చేయడం పెరిగింది. వాటికి ఎవరైనా లైక్‌లు కొట్టకపోతారా? అని ఎదురుచూస్తున్నారు. ఇదే క్రమంలో కొందరు అశ్లీల ఖాతాలకు ప్రభావితం అవుతున్నారు. మరికొందరు నెగటివ్ కామెంట్స్ చదివి కలత చెందుతున్నారు. ఇది వారి మిత్రులు, కుటుంబాన్ని బాధిస్తోంది. సోషల్ మీడియాలో చురుగ్గా ఉంటున్నవారు కొందరు సైబర్ నేరగాళ్లు, ఉన్మాదుల వలలో చిక్కుతుండటం కలవరపెట్టే అంశం.

వాట్సాప్ స్టేటస్‌లు పెడుతున్నారా?

ప్రతి స్మార్ట్‌ఫోన్ వినియోగదారుడు వాట్సాప్‌ను వాడుతున్నారు. నిత్యం స్టేటస్ పెట్టుకోవడం అభిరుచిగా మారింది. కొందరు ఇతరుల మనసును నొప్పించే సందేశాలు పెడుతుండటం వారి మధ్యనున్న సంబంధ బాంధవ్యాలకు గొడ్డలిపెట్టుగా మారుతోంది. ఈ నేపథ్యంలో ఇటీవల బాంబే హైకోర్టు వెలిబుచ్చిన అభిప్రాయాన్ని సామాజిక మాధ్యమాల వినియోగదారులంతా గుర్తుంచుకోవాలి. 'వాట్సాప్ స్టేటస్‌లు పెట్టడం ఒక రకమైన సమాచార వ్యాప్తి వ్యవస్థే. దీనికి యూజర్ బాధ్యులవుతారని' న్యాయస్థానం తెలిపింది. వీడియోలు, సందేశాలు స్టేటస్‌గా వ్యాప్తిచేసే విషయంలో చట్టపరమైన చర్యలు ఎదుర్కోక తప్పదనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. సామాజిక మాధ్యమాల్లో గంటల కొద్దీ గడిపేవారికి వైద్య చికిత్స చేయిస్తే ఫలితం ఉంటుంది.

చెల్లిని హత్యచేసిన నిందితుడి రిమాండ్

వద్దని వారించినా వినకుండా సోషల్ మీడియాలో వీడియోలు పోస్టు చేస్తోందన్న కోపంతో తన చెల్లిని హతమార్చిన నిందితుడిని పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. ఇల్లెందు పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఐ కరుణాకర్ మాట్లాడుతూ... ఇల్లెందు మండలం రాజీవ్‌నగర్‌కు చెందిన అజ్మీర సంఘవి(21) అలియాస్ సింధును సోదరుడు హరిలాల్(22) మంగళవారం హత్యచేశాడు. చెప్పినా వినకుండా సామాజిక మాధ్యమాల్లో వీడియోలు పెడుతోందన్న ఆగ్రహంతో ఆయన ఈ ఘాతుకానికి పాల్పడిన విషయం తెలిసిందే. నిందితుడిని ఇల్లెందులో అదుపులోకి తీసుకుని రిమాండ్ తరలించినట్లు సీఐ తెలిపారు.

సామాజిక మాధ్యమాలకు ఆకర్షితులైన యువత రీల్స్, వీడియోలు చేసే మోజులో పడి తమ విలువైన భవిష్యత్తును, జీవితాన్ని నాశనం చేసుకోవద్దు. ఈ అలవాట్లతో పాటు క్షణికావేశంలో ఎదురయ్యే పరిణామాలు ఆందోళన కలుగజేస్తాయి. విద్యార్థులు చదువుపై దృష్టిసారించేలా తల్లిదండ్రులు మార్గనిర్దేశనం చేయాలి. రమణమూర్తి, డీఎస్పీ ఇల్లెందు

# ఓటరు జాబితాలో మీ పేరుందా..?



కొత్తగూడెం : మొబైల్ నంబర్ ఆధారంగా..%www.nvsp.in% వెబ్‌సైట్‌లోకి వెళ్తే 'సెర్చ్ ఇన్ ఎలక్టోరల్ రోల్' అనే విభాగం కనిపిస్తుంది. దానిని క్లిక్ చేస్తే 'సెర్చ్ బై డిటెయిల్స్' 'సెర్చ్ బై ఎపిక్ నంబర్' 'సెర్చ్ బై మొబైల్ నంబర్' అనే ఉపవిభాగాలు ఉంటాయి. అందులో సెర్చ్ బై మొబైల్ నంబరులో ఓటరు రిజిస్టర్ మొబైల్ నంబర్ నమోదు చేయగానే ఓటీపీ వస్తుంది. దాన్ని పొందుపరచగానే ఓటరు జాబితా వివరాలు కనిపిస్తాయి. మిగతా రెండు విభాగాల్లో మీ పేరు, తండ్రి పేరు, జిల్లా, ఓటరు గుర్తింపు కార్డు నంబరు ద్వారా తెలుసుకోవచ్చు.

మొబైల్ యాప్ పనిచేస్తుందిలా..

గూగుల్ ప్లే స్టోర్‌లో%voter helpline% యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఫోన్ నంబర్‌తో రిజిస్టర్ చేసుకుని లాగిన్ అవ్వాలి. యాప్‌లోకి ప్రవేశించాక సెర్చ్ యువర్ నేమ్ ఇన్ ఎలక్టోరల్ రోల్ విభాగం ఉంటుంది. దానిపై క్లిక్ చేస్తే 'సెర్చ్ బై బార్‌కోడ్, సెర్చ్ బై క్యూఆర్ కోడ్, సెర్చ్ బై డిటెయిల్స్, సెర్చ్ బై ఎపిక్ నంబర్ అనే విభాగాలు కనిపిస్తాయి. మొదటి రెండు విభాగాలకు సంబంధించి మీ ఓటరు గుర్తింపు కార్డుపైనున్న బార్‌కోడ్ లేదా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా ఓటరు జాబితాలో పేరుందా లేదా తెలుసుకోవచ్చు. మీ పేరు, తండ్రిపేరు, వయసు, జిల్లా, నియోజకవర్గం తదితర వివరాల ద్వారా యాప్‌లో వివరాలు సరిచూసుకోవచ్చు.

పోలింగ్ కేంద్రాల వారీగా జాబితా..

%https://ceotelangana.nic.in% వెబ్‌సైట్‌లోకి వెళితే ఎలక్టోరల్ రోల్స్ విభాగం ఉంటుంది. దానిపై క్లిక్‌చేస్తే జిల్లా, అసెంబ్లీ నియోజకవర్గం వివరాలు కనిపిస్తాయి. సంబంధిత నియోజకవర్గం పేరు ఎంచుకుంటే అన్ని పోలింగ్ కేంద్రాల ఓటర్ల జాబితా పీడీఎఫ్ రూపంలో ఉంటుంది. ఏ పోలింగ్ కేంద్రం పరిధిలోకి వస్తారో చూసుకొని దానికి సంబంధించిన జాబితాను పరిశీలించి పేరుందా? లేదా చూసుకోవచ్చు. అందులోనే 'సెర్చ్ యువర్ నేమ్ ఇన్ ఓటర్ లిస్ట్' విభాగం ద్వారానూ ఓటుహక్కు వివరాలు తెలుసుకోవచ్చు.

ఓటరు గుర్తింపు కార్డు సంఖ్య ద్వారా..

%https://voterportal.eci.gov.in% వెబ్‌సైట్ ఓపెన్ చేయగానే 'సెర్చ్ ఇన్ ఎలక్టోరల్ రోల్' విభాగం కనిపిస్తుంది. దానిపై క్లిక్‌చేసి 'ఫొటో ఓటరు గుర్తింపు కార్డు సంఖ్య' పొందుపరిస్తే జాబితాలో మీ పేరు ఉందా? లేదా? పోలింగ్ కేంద్రం.. సీరియల్ నంబర్ వివరాలు కనిపిస్తాయి. ఓటరు గుర్తింపు సంఖ్య తెలియకపోతే 'అడ్వాన్స్ సెర్చ్' విభాగంలోకి వెళ్లి మీ పేరు, తండ్రి పేరు, పుట్టిన తేదీ, జిల్లా, నియోజకవర్గం వివరాలు పొందుపరిస్తే జాబితాలో మీ పేరు ఉందా లేదా తెలుస్తుంది.

# జాగ్రత్తలు పాటిద్దాం.. ఆరోగ్యాన్ని కాపాడుకుందాం

వరంగల్ : కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఊళ్లూ, ఏర్లు ఏకమవుతున్నాయి. నగరాల్లోని కాలనీలు నీట మునుగుతున్నాయి. ఇళ్లలోకి వరద పోటెత్తుతోంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరో వైపు మంచి నీళ్ల నల్లాల నుంచి మురుగు నీరు వచ్చే ప్రమాదం ఉంది. ఈ నీరు తాగితే అతిసారం లాంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు చెబుతున్నారు. భారీ వర్షాల నేపథ్యంలో ఆరోగ్య పరంగా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎంజీఎం ఆసుపత్రి పర్యవేక్షకుడు డాక్టర్ వి.చంద్రశేఖర్‌తో మాట్లాడి అందిస్తున్న ప్రత్యేక కథనం.

కాచి వడపోసి తాగాలి

వర్షాల వల్ల నీరు అనేక విధాలుగా కలుషితం అవుతుంది. క్రిమికీటకాలు కలిసే నీటిని అలాగే తాగితే అతిసారం సోకే ప్రమాదం ఉంది. నీళ్ల విరేచనాలు, వాంతులు అవుతాయి. వీటిని నివారించేందుకు తాగునీటిని కచ్చితంగా కాచి వడపోసి చల్లారాకే తాగాలి. బిందెలపై మూత పెట్టాలి. నగరాలతోపాటు అనేక గ్రామాల్లో కుళాయి నీటిని తాగకుండా నీటి క్యాన్లను కొనుగోలు చేసి తాగుతున్నారు. ఇవి పూర్తిగా సురక్షితమని భావించి ఆ నీటిని అలాగే తాగడం శ్రేయస్కరం కాదు. వీటిని కూడా కాచి వడపోయాలి. కొన్ని క్యాన్లను సరిగా శుభ్రం చేయకపోవడం వల్ల పాకురు లాంటిది పట్టుకొని ఉంటుంది.

పిల్లలు జాగ్రత్త

ఈ సీజన్‌లో పిల్లల కోసం ప్రత్యేక జాగ్రత్తలు తప్పకుండా తీసుకోవాలి. వర్షంలో తడవకుండా చూడాలి. తడిస్తే జలుబు, జ్వరం సోకే ప్రమాదం ఉంది. ఈ చల్లటి వాతావరణానికి బయటకెళితే న్యూమోనియా లాంటివి వస్తాయి. దుమ్ము కూడా లోపలికి వెళ్లకుండా మాస్కు ధరించాలి. వాతావరణం చల్లగా మారడంతో పిల్లలు పానీ పూరీ, బజ్జీల లాంటివి తింటామని అడుగుతారు. వీటిని నివారించి ఇంట్లోనే రుచికరమైన చిరుతిళ్లు చేసి పెట్టాలి. నూనె పదార్థాలకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిది.

వేడిగా తినాలి

ఆహారం విషయంలోనూ చాలా జాగ్రత్తలు అవసరం. నిల్వ ఉన్న



ఆహారం తినడం శ్రేయస్కరం కాదు. అప్పుడే వండిన పదార్థాలు చల్లారక ముందే తినాలి. వంటకాలపై కచ్చితంగా మూతలు ఉండేలా చూడాలి. ఈగలు ఎక్కడెక్కడో కలుషిత ప్రాంతాల్లో వాలి మళ్లీ ఆహారంపై వాలుతాయి. అవి చాలా ప్రమాదకరం.

మూడు రకాల వ్యాధులు సోకుతాయి..– డాక్టర్ వి.చంద్రశేఖర్, పర్యవేక్షకుడు, ఎంజీఎం ఆసుపత్రి

ఆహారం నుంచి ఉత్పన్నమయ్యేవి (ఫుడ్ బార్న్), ఈగలు, దోమల నుంచి (వెక్టార్ బార్న్), గాలి ద్వారా (ఎయిర్ బార్న్) ఇలా మూడు రకాలుగా సోకే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి. వీటి వల్ల టైఫాయిడ్, మలేరియా, డెంగీ, చికున్ గున్యా లాంటి జ్వరాలు, వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. కాచి వడపోసిన నీటిని తాగడం లాంటి జాగ్రత్తలు తీసుకోవాలి. డ్రైడే పాటించాలి. వరంగల్ ఎంజీఎంలో జ్వరాలతో వచ్చేవారికి కోసం వార్డు ఏర్పాటు చేశాం. టైఫాయిడ్, మలేరియా పరీక్షల సంఖ్య పెంచాం.

# పండ్ల తోటల పెంపకానికి రాయితీలు

జనగామ : పండ్ల తోటలను పెంచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు రాయితీలు కల్పించి ప్రోత్సహిస్తున్నాయి. ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేయిస్తున్నారు. మామిడి, జామ, నిమ్మ, బత్తాయి, సపోట, దానిమ్మ, ఆపిల్‌బేర్, సీతాఫలం, డ్రాగన్‌ఫ్రూట్, మునగ తోటలకు ప్రాధాన్యత కల్పిస్తోంది. పండ్ల తోటలను విరివిగా పెంచేందుకు కలెక్టర్ శివలింగయ్య ఉద్యాన, ఉపాధి హామీ శాఖల అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నారు. రైతులు దరఖాస్తు చేసుకునే విధంగా అవగాహన కల్పిస్తున్నారు. ఈ పథకానికి ఏ రైతులు అర్హులు, ఎలా దరఖాస్తు చేసుకోవాలి తదితర విషయాలపె కథనం

రాయితీ ఇలా మట్టి పరీక్షకు, మొక్కలకు గుంతలు తీయుటకు, నాటేందుకు ప్రభుత్వం సహకరిస్తోంది. ఒక్కో మొక్కకు ఎరువుకు రూ. 50, సంరక్షణకు రూ. 10 చొప్పున మూడు సంవత్సరాల పాటు ఇస్తారు. ఆపిల్‌బేర్, దానిమ్మకు రెండు సంవత్సరాలు ఎరువులు, సంరక్షణ కల్పిస్తారు. మునగకు ఏడాది అందిస్తారు. బిందు సేద్య పరికరాలకు ఎస్సీ, ఎస్టీలకు వంద శాతం, చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం రాయితీలను ప్రభుత్వం అందిస్తుంది. ఉపాధి హామీ జాబ్‌కా



ర్డు కల్గి ఉండాలి. పండ్ల తోటల పెంపకానికి అనువైన భూమి, నీటి వసతి ఉండాలి. ఐదు ఎకరాల లోపు ఉన్న ఎస్సీ, ఎస్టీ, సన్న, చిన్నకారు రైతులు అర్హులు.

రైతులు దరఖాస్తు చేసుకోవాలి– రాంరెడ్డి, డీఆర్‌డీవో జనగామ

ప్రభుత్వం అందించే రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి. ఆసక్తి కల్గిన ఎస్సీ, ఎస్టీ, సన్న, చిన్నకారు రైతులు గ్రామ పంచాయతీ సహకారంతో ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. సన్న, చిన్నకారు రైతు ధ్రువీకరణ, గ్రామ పంచాయతీ తీర్మాన పత్రం, జాబ్ కార్డుపట్టాదారు పాసు పుస్తకం, బ్యాంక్ ఖాతా ప్రతులను సమర్పించాలి.

# అందని పెట్టుబడి సాయం

వరంగల్ : జిల్లాలో రైతుబంధు సాయం రైతులందరికీ రాలేదు. వానాకాలం సీజన్‌కు సంబంధించి జూన్ 26 నుంచి ప్రతిరోజు కొంతమంది రైతుల ఖాతాల్లో ఎకరాకు రూ. 5 వేలచొప్పున పెట్టుబడి సాయం జమ చేస్తూ వచ్చారు. 5 ఎకరాల వరకు భూమి ఉన్న రైతుల ఖాతాల్లో జమ చేసిన తర్వాత మిగతా వారికి నిలిపివేశారు. వారంతా డబ్బుల కోసం ఎదురు చూస్తున్నారు. జిల్లాలో 1,50,982 మంది రైతులకు రూ. 136.08 కోట్లు పెట్టుబడి సాయం అందించాల్సి ఉంది. పది రోజుల క్రితం వరకు 1,35,357 మందికి రూ. 107,59, 21,851 సాయాన్ని ఖాతాల్లో జమ చేశారు. ఇంకా ఐదు ఎకరాలకు పైగా ఉన్న 15,625 మంది రైతులకు రూ. 28,48,96,743 పెట్టుబడి



సాయం అందాల్సి ఉంది. వీరంతా పంటలసాగును ముమ్మరం చేశారు. విత్తనం, దుక్కులు దున్నడం, నాట్లు వేయడం, ఎరువులు తదితరాలకు ఖర్చులు పెరిగిపోయాయి. రైతుబంధు సాయం వస్తుందన్న రైతులకు నిరాశే మిగిలింది.సాగుకు అప్పుచేయాల్సి వచ్చింది–అల్లం మోహన్‌రెడ్డి. వెంకటాపూర్. మండలం.ఐనవోలు

నాకు ఆరు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇందులో సగం వరి, సగం పత్తి సాగు చేస్తున్నా. గతేడాది సాగుకు ముందే పెట్టుబడి సాయం బ్యాంకు ఖాతాలో జమ చేశారు. ఈ సారి ఇంకా పడక పోవడంతో వడ్డీ వ్యాపారి వద్ద అప్పులు చేయాల్సి వచ్చింది. పది రోజుల నుంచి ఎదురు చూస్తున్నాను.

# అరుదైన పండు ఔషధ గుణాలుం మెండు

ఖమ్మం : నగరంలోని వీధుల్లో బుధవారం ఓ ప్రత్యేకమైన పండు అందరినీ ఆకర్షించింది. తోపుడు బండ్లపై విక్రయిస్తున్న వీటిని కొనడం కన్నా ఎక్కువ మంది చూసేందుకు రావడం విశేషం. థాయ్‌లాండ్, మలేషియా దేశాల్లో ఎక్కువగా సాగయ్యే ఈ పంట కొన్నేళ్ల నుంచి భారత్‌కు విస్తరించింది. మన దేశంలోని కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లో రైతులు ఎక్కువగా పండిస్తున్నారు. 'రాంబుటాన్' గురించి మన రాష్ట్రంలో చాలామందికి తెలియదు. అద్భుతమైన ఔషధ గుణాలున్న ఈ పంటకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీలు కల్పించి ఇక్కడ కూడా సాగు చేసేందుకు రైతులను ప్రోత్సహిస్తున్నాయి. 2021–22 సంవత్సరానికి సంబంధించి



ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు రాయితీలు వర్తింపజేసి సాగు లక్ష్యాలను ఖరారు చేసినప్పటికీ అవగాహన లేక రైతులు సాగు చేసేందుకు ముందుకు రాలేదు.ధర ఎక్కువే...నగరంలోని పలు ప్రాంతాల్లో ఈ పండ్లు ఒక్కసారిగా ప్రత్యక్షమయ్యాయి. కిలో రూ. 400 చొప్పున విక్రయిస్తున్నారు. పండ్లు చూస్తే ఆకర్షణీయంగా ఉన్నప్పటికీ ధర ఎక్కువగా ఉండటంతో చాలామంది కొనుగోలు చేసేందుకు ముందుకు రావడం లేరు. కేరళ నుంచి రెండు టన్నులు తెచ్చి నగరంలో విక్రయిస్తున్నట్లు పండ్ల వ్యాపారి దుంగ్రోత్ హుస్సేన్ చెబుతున్నారు. ఇందులో విటమిన్–సి, పొటాషియం, జింక్ వంటి అనేక మినరల్స్ సమృద్ధిగా ఉంటాయని మధిర ఉద్యాన అధికారి వేణు వివరించారు.

# సిద్ధమవుతున్న ఖరీఫ్ ప్రణాళిక

అశ్వాపురం : జిల్లాలో వర్షాకాలం సాగుకు సంబంధించిన ఖరీఫ్ ప్రణాళిక సిద్ధమవుతోంది. క్షేత్ర స్థాయిలో వ్యవసాయ అధికారులు పర్యటిస్తూ సాగు అంచనా విస్తీర్ణం సిద్ధం చేస్తున్నారు. ఏటా మృగశిరలో ఖరీఫ్ సాగు ప్రారంభమవుతుంది. ఈలోగానే ప్రణాళికను సిద్ధం చేసేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. రెండు మూడు రోజుల్లో సిద్ధం కావచ్చని భావిస్తున్నారు. జిల్లాలో వరి, పత్తి, మొక్కజొన్న సహా అన్ని పంటలు కలిపి దాదాపు 4.52 లక్షల ఎకరాల్లో సాగయ్యే అవకాశం ఉన్నట్లు ప్రాథమిక అంచనా. గతేడాదితో పోలిస్తే ఈసారి ఖరీఫ్‌లో అన్ని పంటల విస్తీర్ణం పెరిగే అవకాశాలున్నట్లు భావిస్తున్నారు. వరి వెయ్యి ఎకరాలు, పత్తి 10,400, కంది 5 వేలు, ఆయిల్‌పాం 1,300 ఎకరాల విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది. వరి ఉత్పత్తి అధికంగా ఉండటం, సేకరణలో సమస్యలు, జిల్లాలో మిల్లర్ల సామర్థ్యం తక్కువగా ఉన్న నేపథ్యంలో గతేడాది ఖరీఫ్‌లో ఈ సాగును



తగ్గించేందుకు ప్రయత్నం చేశారు. పత్తి సాగును 20 శాతం పెంచడానికి ప్రయత్నించారు. అపరాలు, నూనె గింజల సాగుకు పెద్దపీట వేశారు. అధికారుల ప్రయత్నాలు కొంత ఫలించాయి. జిల్లాలో పత్తి విస్తీర్ణం సహా అపరాలు, నూనె గింజల సాగు విస్తీర్ణం కూడా పెరిగింది. ఈ ఏడాది కూడా అదే ఒరవడిని కొనసాగించనున్నారు. ఇవికాక జిల్లాలో కూరగాయలు 2,597, మామిడి 7,600, జీడిమామిడి 8,541, పండ్లతోటలు 1,847, ఇతర ఆగ్రో రకాలు 20,895 ఎకరాల్లో సాగవుతున్నాయి. వీటి సాగుకు సంబంధించిన ప్రణాళికలనూ రూపొందించే ప్రయత్నాల్లో ఉన్నారు.

40వేల క్వింటాళ్లకు పైగా..వర్షాకాలం ఎక్కడా లోపం లేకుండా విత్తనాలను అందుబాటులో ఉంచేందుకు అధికారులు యత్నిస్తున్నారు. పప్పుధాన్యాలు, నూనె గింజల సాగుపై రైతుల్లో అవగాహన కల్పించాలని భావిస్తున్నారు. మరోవైపు పత్తి విత్తనాలు మినహా మిగిలినవన్నీ రాయితీపై సరఫరా చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నారు. జిల్లాలో ఈ ఏడాది సుమారు 40 వేల క్వింటాళ్లకు పైగా విత్తనాలు అవసరమవుతాయని అంచనా."జిల్లాలో ఖరీఫ్ సాగు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నాం. క్షేత్ర స్థాయిలో వ్యవసాయ అధికారులు కృషి చేస్తున్నారు. రెండు మూడు రోజుల్లో ప్రణాళిక సిద్ధమయ్యే అవకాశం ఉంది."– కె.అభిమన్యుడు, జిల్లా వ్యవసాయ అధికారి

# గ్రానైట్ అక్రమాల గుట్టు తేలేనా..?

కరీంనగర్ : గ్రానైట్ వ్యవహారంలోని డొల్లతనాన్ని బయటపెట్టేలా క్షేత్రస్థాయి విచారణకు ఉమ్మడి జిల్లా యంత్రాంగం సిద్ధమవుతోంది. గత నెలలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పలు గ్రానైట్ క్వారీలు పర్యావరణానికి విఘాతం కలిగించేలా వ్యవహరిస్తున్నాయనేలా జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్‌జీటీ) కన్నెర్ర చేయడంతోపాటు కొందరికి నోటీసులు జారీ చేయడంతో అధికారులు అప్రమత్తమవుతున్నారు. వ్యాపారాన్ని సాగించే పలు కంపెనీలు ఫెమా (ఫారిన్ ఎక్ఛేంజ్ మేనేజ్‌మెంట్ యాక్ట్) నిబంధనల్ని ఉల్లంఘించాయనే విషయమై గత కొన్నాళ్లుగా కొనసాగుతున్న ఫిర్యాదులకు స్పందించిన న్యాయస్థానం సమగ్ర విచారణను చేపట్టాలని ఆదేశించింది. దీంతో ఈ నెల 10న కలెక్టర్ పర్యవేక్షణలో కరీంనగర్ జిల్లాధికారులు అత్యవసర సమీక్ష నిర్వహిస్తున్నారు. క్షేత్రస్థాయిలో వాస్తవాలు తెలుసుకునేందుకు విచారణను చేపట్టేందుకు ఆయా శాఖలతో కూడిన కమిటీని ఏర్పాటు చేయబోతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 320 క్వారీల వద్ద ఉన్న వాస్తవ పరిస్థితుల్ని వీరు గమనించనున్నారు. కాలుష్య నియంత్రణ మండలి, జలవనరుల శాఖ, మైనింగ్, పోలీసు, రెవెన్యూ విభాగాలకు చెందిన కీలకమైన అధికారులను విచారణ సభ్యులుగా నియమించనున్నారు. ఈ నెల 19వ తేదీ లోగా సమగ్రమైన నివేదికను అందించేలా జిల్లా అధికారులు సమాయత్తమవుతున్నారు.

నిజాల నిగ్గు తేలేనా..?

గనుల ఖిల్లాగా మారిన ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని సహజ వనరులను ఇష్టానుసారంగా దోపిడీ చేస్తున్నారనేలా తరచూ ఎవరో ఒకరు రాష్ట్ర, కేంద్రస్థాయిలోని ఉన్నతాధికారులకు ఫిర్యాదులను అందిస్తున్నారు. ముఖ్యంగా 2013లో విజిలెన్స్ అధికారులు చేసిన తనిఖీల్లో గుర్తించిన అక్రమాల విషయంలో ప్రభుత్వానికి రావాల్సిన ఫెనాల్టీని ఎగవేశారంటూ హైదరాబాద్‌కు చెందిన పేరాల శేఖర్‌రావు గతేడాది నవంబరులో సీబీఐకి ఫిర్యాదు చేశారు. ఆయా గ్రానైట్ సంస్థలు రూ.124.94 కోట్ల జరిమానాను ఐదింతలుగా రూ.749 కోట్లు చెల్లించలేదని, పైగా నిబంధనలకు విరుద్ధంగా పర్యావరణ దోపిడీ జరుగుతుందని ఫిర్యాదులో ఆయన పేర్కొన్నారు. గతంలోనూ జిల్లాకు చెందిన భాజపా రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, వైఎస్సార్‌టీపీ నాయకుడు సింగిరెడ్డి భాస్కర్‌రెడ్డి, న్యాయవాది భేతి మహేందర్‌రెడ్డిలు కూడా గ్రానైట్ వ్యాపారంలో జరుగుతున్న అక్రమాలపై విచారణ చేపట్టాలని కోరారు. వరుస ఫిర్యాదులతో స్పందించిన ఉన్నతాధికారులు, ఎన్‌జీటీలు ఉమ్మడి జిల్లాలోని ఖనిజ సంపద కొల్లగొడుతున్న విషయమై తగిన దృష్టిని సారించాయి. అనుమతి ఇచ్చిన క్వారీలలో ఇష్టానుసారంగా పేలుళ్లకు పాల్పడుతూ సమీపంలోని రైతులు, గ్రామాల ప్రజలకు నష్టం కలిగేలా చేస్తున్నారనే విషయమై విచారణ అధికారులు సమగ్రంగా పరిశీలనల్ని జరపనున్నారు. ఎప్పటికప్పుడు ఆయా క్వారీల్లో జరుగుతున్న మోసాలు, అక్రమాలపై జల్లా యంత్రాంగం అనుకున్న విధంగా స్పందించిన దాఖలాలు లేవు. కనీసం త్వరలో చేపట్టే విచారణనైనా పక్కాగా నిర్వహిస్తూ నిజాల నిగ్గును తేలిస్తే బాగుంటుందనే భావనను ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. అతిక్రమించిన నిబంధనలపై పక్కాగా వ్యవహరించడంతోపాటు లీజుల వ్యవహారాలు, ఇష్టానుసారంగా జరిగిన తవ్వకాలు, రాయి అమ్మకాలపై పూర్తిస్థాయి వివరాల్ని సేకరించాల్సిన అవసరముంది. మరి మన అధికారులు ఏమేరకు చొరవ చూపిస్తూ ఎలాంటి విచారణ సాగిస్తారనేది ఆసక్తికరంగా మారింది.

# పదోన్నతులకు 'ముందస్తు' జాబితాలు



ఆదిలాబాద్ : ఉపాధ్యాయ పదోన్నతుల షెడ్యూల్ ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండేలా విద్యాశాఖ అప్పుడే ముందస్తు కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా కేటగిరీల వారీగా ఉపాధ్యాయుల జాబితాలను తయారుచేసింది. అభ్యంతరాలు ఉంటే ఈ నెల 11లోగా తెలపాలని కార్యాలయ వర్గాలు సంఘాల వాట్సాప్ గ్రూపులకు జాబితాలను పంపడం కౌన్సెలింగ్ ప్రక్రియ సాఫీగా సాగేలా జాగ్రత్తలు తీసుకుంటోంది. విద్యాశాఖ పరిధిలో సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్‌జీటీ)లకు పదోన్నతి కల్పించే వెసులుబాటు ఉండటంతో.. ఆ మేరకు అధికారులు ముందస్తు కసరత్తులో నిమగ్నమయ్యారు. ఇందులో స్కూల్ అసిస్టెంట్ ఖాళీలు 205 ఉన్నట్లు గుర్తించారు. ప్రభుత్వ యాజమాన్య పరిధిలో 33, స్థానికసంస్థలు యాజమాన్య పరిధిలో 172 ఖాళీలు ఉన్నట్లుగా తేల్చారు. ఇందుకోసం ఒక్కో కేటగిరిలో ఒక్కో పోస్టుకు ముగ్గురు చొప్పున ఉపాధ్యాయులను గుర్తిస్తూ పదోన్నతికి అర్హులైన జాబితాలను తయారుచేశారు. ఆయా జాబితాల్లో మొత్తం 603 మంది ఎస్‌జీటీ ఉపాధ్యాయులు స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులకు అర్హులుగా తేల్చి జాబితాలో చోటు కల్పించారు. పీఎస్‌హెచ్‌ఎంల పదోన్నతి కోసం 1986 నుంచి 2002 డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులకు చోటు దక్కగా.. మిగిలిన స్కూల్ అసిస్టెంట్ల జాబితాలో 1989 నుంచి 2002 సంవత్సర డీఎస్సీ ఉపాధ్యాయులు ఉన్నారు.

కొన్నింటికి అర్హులు లేరట

మరాఠీ మాధ్యమంలో స్థానిక సంస్థల యాజమాన్య పరిధిలో స్కూల్ అసిస్టెంట్ గణితం, ఫిజిక్స్, ఉర్దూ మాధ్యమం ప్రభుత్వ యాజమాన్య పరిధిలో స్కూల్‌అసిస్టెంట్ సోషల్ స్టడీస్‌లో ఖాళీలు ఉన్నా అర్హులైన ఉపాధ్యాయులు లేనట్లుగా జాబితాల్లో విద్యాశాఖ పొందుపర్చింది. మొత్తం ఆయా సబ్జెక్టుల్లో నాలుగు పోస్టులకు అర్హులైన వారు లేకపోవడంతో అవి అలాగే మిగిలిపోనున్నాయి. గోప్యంగా కసరత్తు..అధికారికంగా ఇంకా షెడ్యూల్ విడుదల కానందున విద్యాశాఖ లోలోన కసరత్తు చేస్తోంది. గోప్యంగా వివరాలను ఉపాధ్యాయ సంఘాల వాట్సాప్ గ్రూప్‌లకు పంపించడం విమర్శలకు తావిస్తోంది. అందరికి తెలిసేలా కసరత్తు చేస్తే ప్రతి ఉపాధ్యాయుడికి సమాచారం చేరుతుందనే భావన వ్యక్తమవుతోంది.పదోన్నతి ఖాళీలు ఇవే..తెలుగు, హిందీ, మరాఠీ, ఉర్దూ మాధ్యమాలు కలిపి 50 కేటగిరీలకు కలిపి సబ్జెక్టుల వారీగా పదోన్నతి ఖాళీలు యాజమాన్యాల వారీగా ఇలా ఉన్నాయి. ఈ ఖాళీలకు ముగ్గురు చొప్పున ఉపాధ్యాయులతో జాబితాలు తయారుచేశారు.

# మళ్లీ తెరపైకి 'ప్రైవేటు పంచాయితీ



ఆసిఫాబాద్ : గ్రామాల్లో వీధి దీపాల నిర్వహణ బాధ్యతను ప్రైవేటు సంస్థకు అప్పగించే అంశం మరోసారి తెరపైకి వచ్చింది. ఇందుకు గ్రామ పంచాయతీ సర్పంచుల నుంచి తీర్మానాలు పంపించాలని పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ నుంచి జిల్లా పంచాయతీ అధికారులకు ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. రెండేళ్ల క్రితం ఇలాంటి ఆదేశాలు జారీ కావడంతో జిల్లాలో 335 జీపీలకు గాను సుమారు 320 కిపైగా జీపీల్లో తీర్మానాలు తీసుకొని పంపించారు. తీర్మానాలు ఇచ్చినా.. ఈ విధానాన్ని చాలా పంచాయతీల్లో తీవ్రంగా వ్యతిరేకించారు. దీంతో ప్రభుత్వం ఈ అంశంపై వెనక్కి తగ్గింది. మూడురోజుల క్రితం తీర్మానాలు పంపించాలని మళ్లీ ఉత్తర్వులు జారీ కావడం మళ్లీ చర్చనీయాంశంగా మారింది.గ్రామాల్లో వీధి దీపాల ఏర్పాటు, నిర్వహణ బాధ్యతను పంచాయతీలే చూస్తాయి. చాలా పంచాయతీల్లో సిబ్బంది కొరత, ఫిలమెంట్ బల్బుల ఏర్పాటుతో విద్యుత్తు వినియోగం పెరిగి బిల్లుల మోత మోగడం, సరైన ఆన్/ఆఫ్ వ్యవస్థ లేక నిరంతరం వెలుగుతున్న బల్బులతో విద్యుత్తు దుబారా కావడం, తరచూ కాలిపోవడం, వీటి కొనుగోళ్లలో అక్రమాలకు దారితీయడం తదితర సమస్యలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంది. ఈ నేపథ్యంలో ఎలాంటి వృథాకు తావులేకుండా విద్యుత్తు ఆదా కోసం ఫిలమెంట్ బల్బుల స్థానంలో ఎల్‌ఈడీ బల్బులు ఏర్పాటు చేయడం, వాటి నిర్వహణ కోసం ఎనర్జీ ఎఫీషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్) సంస్థకు బాధ్యతలు అప్పగించేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. ఇందుకు గ్రామ పంచాయతీల నుంచి తొలుత ఈ నెల5 తర్వాత 7 లోపే తీర్మానాలు పంపాలని పంచాయతీరాజ్‌శాఖ కమిషనర్ తాజాగా ఆదేశాలు జారీ చేశారు. దీంతో జిల్లా పంచాయతీ అధికారులు అన్ని జీపీల కార్యదర్శులకు విషయాన్ని తెలియజేసి సర్పంచుల ద్వారా తీర్మానాలు పంపించాలని ఆదేశించారు. ఇంకాచాలా చోట్ల రావాల్సి ఉంది.

సంస్థ నిర్వహణ ఇలా..గ్రామాల్లో విద్యుత్తు స్తంభాల సంఖ్యకు అనుగుణంగా ఎల్‌ఈడీ దీపాలు, వాటి అమరికకు అవసరమైయ్యే పరికరాలు ఇతర సామగ్రిని సంస్థే సరఫరా చేస్తూ నిర్వహణ చూడనుంది. ఇందుకోసం జిల్లా స్థాయిలో జిల్లా పంచాయతీ అధికారి ఈఎస్‌సీఆర్‌ఓడబ్ల్యూ ఖాతా తెరవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సామగ్రి, నిర్వహణ ఖర్చులను సంబంధిత పంచాయతీల నుంచి నెలనెలా జిల్లా పంచాయతీ అధికారి సేకరించి సంస్థ ఖాతాకు జమచేయాలి. ఏదైనా పంచాయతీ డబ్బులు చెల్లించకుంటే.. నెలనెలా ప్రభుత్వం పంచాయతీలకు ఇచ్చే నిధులు, సాధారణ కేటాయింపుల నుంచి కోత విధించి సంస్థ ఖాతాలో చెల్లించేలా డీపీవోలకు అధికారం ఇచ్చారు. బిల్లుల భారం తగ్గించేందుకు ఎల్‌ఈడీ బల్బుల ఏర్పాటు నిర్ణయం బాగున్నా.. వాటి నిర్వహణ బాధ్యతను ప్రైవేటు సంస్థకు అప్పగించడంపై కొందరు సర్పంచులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. తమ ప్రమేయం లేకుండానే అధికారులే నేరుగా కోత విధించి సంస్థ ఖాతాలో జమచేయడంతో నిధుల నియంత్రణను కోల్పోవాల్సి వస్తుందని వాపోతున్నారు. గ్రామాల్లో వీధి దీపాల ఏర్పాటు కోసం ప్రజలు కార్యదర్శులు, సర్పంచులను సంప్రదిస్తారు. నిర్వహణను ప్రైవేటు సంస్థకు అప్పగిస్తే తమ ఉనికి దెబ్బతింటుందని మరికొందరు ఆందోళన చెందుతున్నారు.

కమిషనర్ కార్యాలయానికి పంపిస్తాంరవికృష్ణ, డీపీఓ

ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని జీపీల్లో సర్పంచుల ద్వారా తీర్మానాలు చేసి పంపించాలని కార్యదర్శులకు సూచించాం. అవి వచ్చిన వెంటనే కమిషనర్ కార్యాలయానికి నివేదికలు పంపిస్తాం.

# నిధుల జాడలేదు.. గండ్లు పూడ్చలేదు..

భైంసా : వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలకు జిల్లాలోని వివిధ చెరువులకు భారీ నష్టం వాటిల్లింది. కొన్ని చెరువు కట్టలకు గండ్లుపడగా మరి కొన్నింటికి తూములు, అలుగులు, కాల్వలు దెబ్బతిన్నాయి. వాటి కింద పంట పొలాలు బీళ్లుగా మారాయి. నష్టం జరిగి ఎనిమిది నెలలు అవుతోంది. మరమ్మతుల కోసం నీటిపారుదలశాఖ అధికారులు నివేదికలు రూపొందించి నిధుల కోసం ప్రతిపాదించారు. ప్రభుత్వం నేటికీ నిధులు మంజూరు చేయకపోవడం గమనార్హం. పైగా చెరువులకు వచ్చిన నీరు వచ్చినట్లే వృథా అవుతోంది. గత వర్షాకాలంలో జరిగిన పంట నష్టానికి ప్రభుత్వం నేటికీ రూపాయి పరిహారం ఇవ్వలేదు. కట్టకు దిగువన ఉన్న ఆయకట్టు పొలాలు కోతకు గురై పూడ్చుకోలేని నష్టం వాటిల్లుతుందని భయాందోళన చెందుతున్నారు. ప్రభుత్వం సకాలంలో నిధులు మంజూరు చేయక, అధికారులు మరమ్మతులు చేపట్టకపోతే వచ్చే వర్షాకాలంలో తాము సాగు చేసిన పంటలకు మరోసారి వరదనష్టం జరిగి చేసిన కష్టం, పెట్టిన పెట్టుబడి అంతా బూడిదలో పోసిన పన్నీరవుతుందంటున్నారు. పలు చెరువులపై ఆధారపడిన మత్స్యకారులకు ఉపాధి కరవు అవుతుంది. ఆ ప్రాంతంలోని నీరు వృథా వర్షాకాలంలో పెంపొందే భూగర్భజల మట్టానికి విఘాతం ఏర్పడి పరిసరాల్లోని బోరుబావులు భవిష్యత్తులో వట్టిపోయే ప్రమాదం పొంచి ఉంటుంది.

అత్యవసర నిధులతో..

ఇది ఇలా ఉంటే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆయా స్థాయిలో నీటిపారుదలశాఖ సీఈ, ఎస్ఈ, ఈఈ అత్యవసర నిధుల నుంచి జిల్లా వాటాగా వచ్చిన రూ.66.27లక్షల నిధులతో 29 పనులను తాత్కాలికంగా పూర్తిచేసినట్లు నీటిపారుదలశాఖ అధికారుల చెబుతున్నారు. ప్రభుత్వం ప్రతిపాదిత నిధులు ఇవ్వకపోవడంతో



వాటికి శాశ్వత, ఇతర పనులకు పూర్తిస్థాయిలో ఎప్పుడు మరమ్మతులు చేపడతారనేది ప్రశ్నార్థకంగా మారింది.

నష్ట నివారణ చర్యలు

రామారావు, ఈఈ, జిల్లా నీటిపారుదలశాఖ, నిర్మల్

జిల్లాలో అత్యవసర నిధులతో కొన్ని చెరువులకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టాం. భారీ వర్షాలకు చెరువుల కింద జరిగిన నష్టానికి మరమ్మతులకు అవసరమైన నిధుల కోసం అంచనాలను రూపొందించి ప్రభుత్వానికి ప్రతిపాదించ్చా. నిధులు రావాల్సి ఉంది. మంజూరు కాగానే పూర్తిస్థాయి పనులను చేపడతాం.

జిల్లాలో చెరువులు : 791
ఆయకట్టు : 53వేల ఎకరాలు
వర్షాలకు దెబ్బతిన్నవి : 125
మరమ్మతుల కోసం ప్రతిపాదించిన నిధులు : రూ.10 కోట్లు

# కేంద్రాల ప్రారంభం సరే... తూకాలేవి?

రుద్రంగి : రుద్రంగి మండల వ్యాప్తంగా ఇరవై రోజుల క్రితం యాసంగి వరి కోతలు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే ధాన్యంతో మార్కెట్ యార్డు నిండిపోయింది. మరోవైపు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన అధికారులు తూకాలు ప్రారంభించలేదు. ఆకాశంలో కమ్ముకుంటున్న మబ్బులు, కురుస్తున్న చిరుజల్లులు ధాన్యం ఆరబోసిన రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. కేంద్రాలకు తీసుకువచ్చి పదిహేను నుంచి ఇరవై రోజులు గడుస్తున్నా తూకం వేయకపోవడంతో అన్నదాతలు పడిగాపులు కాస్తున్నారు.గత సంవత్సరం యాసంగిలో మండలంలో సుమారు 3,500 ఎకరాల్లో వరి పంట సాగు చేయగా సుమారు 1.5 లక్షల క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వచ్చింది. ఈ యాసంగిలో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు



చేసేది లేదని ప్రకటించటంతో సాగు విస్తీర్ణం తగ్గింది. ఈ ఏడాది యాసంగిలో కేవలం 2400 ఎకరాలకే పరిమితమైంది. గత ఏడాది ఏప్రిల్ చివరి వారంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాగా జూన్ చివరి వారం వరకు కొనసాగింది. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని తొందరగా కొనుగోళ్లను చేపడితేనే జూన్ మొదటి వారం వరకు పూర్తి చేసే అవకాశం ఉంటుంది. లేదంటే జూన్ చివరి వరకు కొనుగోళ్ల ప్రక్రియ సాగే అవకాశం ఉంటుంది. ఈ యాసంగిలో మండల వ్యాప్తంగా సుమారు 70 నుంచి 80 వేల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా.

వీటిపై దృష్టిసారిస్తే మేలు ధాన్యం తూర్పార పట్టడానికి అవసరమైన యంత్రాలు అందుబాటులో ఉంచాలి. ధాన్యం మిల్లులకు చేరుకున్న తర్వాత తరుగు పేరిట అదనంగా కోత విధించకుండా చూడాలి. లారీలు, గన్నీ సంచుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలి. కొనుగోలు కేంద్రాల్లో విద్యుద్దీకరణ, తాగు నీరు, నీడ వసతులు ఏర్పాటు చేయాలి. అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా టార్పాలిన్ కవర్లను కొనుగోలు కేంద్రాల నిర్వాహకులే రైతులకు అందిస్తే బాగుంటుంది.

తొందరగా కొనుగోళ్లు చేపట్టాలి : – ఇప్ప మహేశ్, రైతు, రుద్రంగి

నాకున్న నాలుగు ఎకరాల్లో సుమారు 120 క్వింటాళ్ల వరకు ధాన్యం పండించాను. ఆకాశంలో నిత్యం మేఘాలు ఏర్పడుతున్నందున ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించి వెంటనే తూకాలు వేయాలి. కాంటాలను పూర్తి చేసిన బస్తాలను జాప్యం చేయకుండా మిల్లులకు పంపిస్తేనే తర్వాత ధాన్యం తీసుకు వచ్చే రైతులకు స్థలం దొరుకుతుంది. గతంలో బస్తాలను మిల్లులకు పంపడంలో జాప్యం జరగటం వల్ల బస్తాలు కూడా తడిసి రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

15 రోజుల కిందట తీసుకొచ్చాను : – లావుడ్య రవి, రైతు, రుద్రంగి

నాకు ఉన్న ఐదు ఎకరాలతో పాటు మరో 12 ఎకరాలను కౌలుకు తీసుకుని వరి సాగు చేశాను. పదిహేను రోజుల క్రితం ధాన్యాన్ని మార్కెట్ యార్డుకు తీసుకువచ్చాను. సుమారు 500 క్వింటాళ్ల ధాన్యాన్ని ఆరబెట్టుకోవటానికి నిత్యం 5 కి.మీ.ల దూరంలో ఉన్న కుక్కలగండి తండా నుంచి కుటుంబ సభ్యులతో కలిసి నిత్యం మార్కెట్ యార్డుకు వచ్చి ఆరబెట్టడం, మేఘాలను చూసి మళ్లీ కుప్పలు చేయాల్సి వస్తోంది.

మూడు, నాలుగు రోజుల్లో ప్రారంభిస్తాం : –శ్రీనివాసరావు, ఏఎంసీ ఛైర్మన్, రుద్రంగి

మూడు, నాలుగు రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభిస్తాం. సనుగుల ప్యాక్స్, రుద్రంగి ఏఎంసీలకు కేటాయించిన రైస్ మిల్లుల్లో ఎఫ్‌సీఐ తనిఖీలు జరుగుతున్నాయి. తనిఖీల ప్రక్రియ ముగిసిన తర్వాత కొనుగోళ్లను చేపడతాం.

# హద్దులు చెరిపేసి... ఆక్రమణలకు తెరతీసి...

సిరిసిల్ల : రాజరాజేశ్వర జలాశయం నిర్వాసితులకు ప్రభుత్వం పంపిణీ చేయగా మిగులు స్థలాల రక్షణను పూర్తిగా విస్మరించారు. అవి ఆక్రమణల పాలవుతున్నా వాటిని కాపాడే ప్రయత్నం చేయకపోవడం విచారకరం. నిర్వాసితులు పొందిన ప్లాట్లు, అందులో నిర్మించుకున్న ఇళ్ల నిర్మాణాల క్రయ, విక్రయాలకు అనుమతులిస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఇవి అమల్లోకి రావడానికి ఇంకా సమయం పడుతుంది. ఈ లోపు కాలనీల్లో పలుకుబడి కలిగిన వారు హద్దులు చెరిపేసి ఆక్రమణల పర్వానికి తెరతీశారు.రాజరాజేశ్వర జలాశయం నిర్మాణంలో బోయినపల్లి, తంగళ్లపల్లి, ఇల్లంతకుంట మండలాల పరిధిలోని 12 గ్రామాల్లో 11,731 మంది నిర్వాసితులను ప్రభుత్వం గుర్తించింది. వీరికి నివాస స్థలాలకు వేములవాడ, బోయినపల్లి, తంగళ్లపల్లి మండలాల పరిధిలో 11 కాలనీలకు 1,171.18 ఎకరాల ప్రభుత్వ, ప్రైవేటు స్థలాలను సేకరించారు. వీటిలో ఒక్కో నిర్వాసితునికి 242 చదరపు గజాల స్థలాన్ని పట్టాగా అందజేశారు. వీటితోపాటు పంచాయతీ, ఇతర ప్రభుత్వ భవనాలు, మౌలిక వసతులను కల్పించారు. కాగా చాలా కాలనీల్లో నిర్వాసితులకు పంపిణీ చేయగా మిగులు ప్లాట్లు, మరికొన్ని చోట్ల ప్లాట్లుగా చేయని ఖాళీ స్థలాలు ఉన్నాయి. ఇటీవల కాలంలో ఇవి అన్యాక్రాంతానికి గురవుతున్నాయి. నీలోజిపల్లి, కొదురుపాక ఆర్అండ్ఆర్ కాలనీల చుట్టూ హద్దులు సుమారు ఐదెకరాల పైనే ఆర్అండ్ఆర్ కాలనీలో ఆక్రమణలకు గురయ్యాయి. ఇటీవల కాలనీవాసులు ఆక్రమణలను గుర్తించి ఫిర్యాదు చేయడంతో నిర్మాణాలను అడ్డుకున్నారు. కానీ ఇప్పటికీ ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. అలాగే వేములవాడ మండలం పరిధిలోని రుద్రవరం, అనుపురం, కొడుముంజ కాలనీల సమీపంలో ప్రైవేటు వెంచర్లతో రిజిస్ట్రేషన్లు జరిగాయి. రెవెన్యూ అధికారులకు తెలిసినా వీటిని నిలువరించలేదు. ఇప్పటికీ చాలా కాలనీల్లో హద్దులు లేవు.చర్యలు తీసుకుంటాం : – శ్రీనివాసరావు, ఆర్డీవో, సిరిసిల్ల

ఖాళీ ప్లాట్ల ఆక్రమణలు, కబ్జాలు ఆయా మండలాల పరిధిలోని రెవెన్యూశాఖ దృష్టిలో ఉన్నాయి. రిజిస్ట్రేషన్ల అనుమతులకు ముందే పకడ్బందీ చర్యలు తీసుకుంటాం. సిబ్బందితో క్షేత్రస్థాయిలో పరిశీలించి కాలనీల చుట్టూ హద్దులు ఏర్పాటుపై పరిశీలిస్తాం.

హద్దులు ఏర్పాటు చేస్తేనే...నిర్వాసితులకు కేటాయించిన ప్లాట్ల క్రయ, విక్రయాలకు గత నెల రెవెన్యూశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. పట్టాలు పొంది, ఇళ్ల నిర్మాణం చేసుకున్నవారికి అవకాశం ఉంటుంది. నిర్వాసితులకు కేటాయించక ఖాళీగా ఉన్న ప్లాట్లు పూర్తిగా రెవెనూ ఆధీనంలోనే ఉంటాయి. రిజిస్ట్రేషన్ శాఖకు ఉత్తర్వులు పంపించే క్రమంలో కాలనీల వారీగా ఖాళీ ప్లాట్ల వివరాలు రిజిస్ట్రేషన్లకు అనుమతి లేకుండా చర్యలు తీసుకోవాలి. క్షేత్రస్థాయిలో ఖాళీ ప్లాట్ల వివరాలు తెలుపుతూ ఇవి ప్రభుత్వ ఆధీనంలోని అని బోర్డులను ఏర్పాటు చేయాలి. వేములవాడ, బోయినపల్లి మండలాల పరిధిలోని ఆర్అండ్ఆర్ కాలనీలు సిరిసిల్ల–కరీంనగర్ రహదారిని ఆనుకుని ఉన్నాయి. ఇక్కడ గజం స్థలం వేలల్లో పలుకుతోంది.

# తాడేపల్లికి వినతుల వెల్లువ.. ఎక్కడ నుంచి ఎందుకు?



అమరావతి : వైసీపీ అధినేత, సీఎం జగన్‌కు వినతులు వెల్లువెత్తుతున్నాయని తాడేపల్లి వర్గాలు చెబుతున్నాయి. అవన్నీ కూడా వచ్చే ఎన్నికలకు సంబంధించిన వినతులేనని ఆ వర్గాలు అంటున్నాయి. "వచ్చే ఎన్నికలకు సంబంధించి ఇప్పటికే కొన్ని వందల వినతులు వచ్చాయి. వీటిని పరిష్కరించే బాధ్యత ఇప్పుడు తలకు మించిన భారంగా మారింది" అని గుంటూరుకు చెందిన కీలక నాయకుడు, తాడేపల్లిలోనే ఉండి.. పార్టీ కార్యక్రమాలపై దృష్టి పెట్టే నేత ఒకరు చెప్పుకొచ్చారు. అయితే.. ఈ వినతుల్లో సాధారణంగా.. టికెట్లు ఆశించేవారు ఉంటారని.. వచ్చే ఎన్నికల్లో తమకు టికెట్ ఇవ్వాలని కోరుకునేవారు ఇలా.. ఏదో ఒక రూపంలో అధినేతను ఆశ్రయిస్తారని అనుకుంటే పొరపాటే. ప్రస్తుతం ఎమ్మెల్యేలుగా ఉన్నవారికి టికెట్లు ఇవ్వొద్దని.. కొందరు, అవినీతి జరుగుతోందని మరికొందరు.. ఇలా.. నేరుగా సాక్ష్యాలు, ఆధారాలతో సహా.. తాడేపల్లికి వర్తమానం చేరవేస్తున్నారు. వీటిలో కీలకమైన 8 నియోజకవర్గాలు ఉన్నాయని తాడేపల్లి వర్గాలు చెబుతున్నాయి. పత్తికొండ, గన్నవరం, పాతపట్నం, విశాఖ ఉత్తరం(ఇక్కడ టీడీపీ గెలిచింది), గురజాల, మచిలీపట్నం, పెడన, మైలవరం, చిలకలూరి పేట(మహిళా మంత్రి ప్రాతినిథ్యం), ప్రత్తిపాడు, రాజమండ్రి సిటీ(ఇక్కడ టీడీపీ విజయం సాధించింది), తుని, టెక్కలి(ఇక్కడ టీడీపీ విజయం దక్కించుకుంది), రాజంపేట వంటి అత్యంత కీలకమైన నియోజకవర్గాలు ఉన్నాయి. ఆయా నియోజకవర్గాల్లో ప్రస్తుతం ఉన్నవారికి లేదా.. టికెట్‌లు ఆశిస్తున్నవారికి ఉన్న వ్యతిరేకతపై నివేదికలతో కూడిన వినతులు వచ్చాయనేది తాడేపల్లి వర్గాల మాట. ఒకవైపు.. వచ్చే ఎన్నికలను సీరియస్‌గా తీసుకున్న పార్టీ అధిష్టానానికి క్షేత్రస్థాయిలో అంతా పరిస్థితి బాగుందని అనుకున్నా.. ఇప్పుడు వెల్లువెత్తుతున్న సొంత నేతల విమర్శలు.. క్షేత్రస్థాయిలో వస్తున్న ఆరోపణలు వంటివి మింగుడుపడడం లేదు. అలాగని ఇప్పుడున్న వారిని మార్చే పరిస్థితి కూడా అంతంత మాత్రంగానే ఉందని తెలుస్తోంది. మరి ఏం చేస్తారో చూడాలి.

# సీమ డిక్లరేషన్ ఇక, సీరియస్సే.. చంద్రబాబు సంచలన నిర్ణయం



అమరావతి : టీడీపీ యువ నాయకుడు నారా లోకేష్ చేస్తున్న యువగళం పాదయాత్ర లో 'రాయలసీమ డిక్లరేషన్'ను ప్రకటించిన విషయం తెలిసిందే. ఇక, ఈ డిక్లరేషన్ ను కొందరు బుట్టదాఖలు చేశార ని విమర్శించినా.. పార్టీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు సీమ డిక్లరేషన్ ను సీరియస్ గానే తీసుకున్నట్టు కనిపిస్తోంది. వరుసగా మూడు రోజుల నుంచి ఆయన సీమ లోని సాగునీటి ప్రాజెక్టుల ను లక్ష్యంగా చేసుకుని వైసీపీ సర్కారు పై విమర్శలు చేస్తున్నారు. ఇక, ఇవి కొనసాగుతున్నక్రమంలోనే తాజాగా మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. వచ్చే నెల 1 నుంచి వరుసగా నాలుగు రోజుల పాటు ఆయన రాయలసీమ లోని జిల్లాల్లో పర్యటించనున్నారు. ఈ నాలుగు రోజుల్లోనూ వివిధ ప్రాజెక్టుల ను సందర్శించి.. గత టీడీపీ సర్కారు ఏం చేసిందో.. ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం ఏం చేసిందో కూడా చంద్రబాబు వివరించనున్నారు. ఈ కార్యక్రమానికి సంబందించిన షెడ్యూల్ కూడా ఖరారైంది. ఈ నాలుగు రోజుల కార్యక్రమానికి రైతులు భారీ సంఖ్యలో తరలి వచ్చేలా ఏర్పాట్లు కూడా పార్టీ తరఫున చేస్తుండడం గమనార్హం.

**ఆగస్టు 1: రాయలసీమ లో సాగునీటి ప్రాజెక్టుల సందర్శన ఉంటుంది**
**ఆగస్టు 2: రైతుల తో ముఖాముఖి.. సమస్యల పై చర్చ. గత ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టులు, పురోగతి వివరాల పై వివరణ**
**ఆగస్టు 3: గండికోట రిజర్వాయర్ పరిశీలన. అనంతపురం జిల్లాలో పర్యటన**
**ఆగస్టు 4: కళ్యాణదుర్గం లో భైరవానితిప్ప ప్రాజెక్టు, పేరూర్ లో ఇతర ప్రాజెక్టులు పరిశీలిస్తారు.**

# నా వాంగ్మూలాన్ని సీబీఐ తప్పుగా రికార్డు చేసింది: అజేయ కల్లం



హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో తన వాంగ్మూలంపై తెలంగాణ హైకోర్టులో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారు అజేయ కల్లం పిటిషన్ దాఖలు చేశారు. సీబీఐ తన వాంగ్మూలాన్ని తప్పుగా నమోదు చేసిందని అందులో వెల్లడించారు. సీఎం జగన్‌ను భారతి పిలిచారని సీబీఐకి తాను చెప్పలేదని చెప్పారు. వివేకా హత్య కేసు ఛార్జిషీట్ నుంచి తన వాంగ్మూలాన్ని తొలగించాలని కోరారు. తన వాంగ్మూలానికి సంబంధించి మళ్లీ విచారణ జరిపేలా సీబీఐని ఆదేశించాలని పిటిషన్‌లో అజేయ కల్లం పేర్కొన్నారు. "లోటస్‌పాండ్‌లో ఉండగా ఉదయం 5.30 గంటలకు అటెండర్ తలుపు కొట్టారు. వైఎస్ భారతి మేడపైకి రమ్మంటున్నారని అటెండర్ జగన్‌కు చెప్పారు. బయటకు వెళ్లి 10 నిమిషాల తర్వాత జగన్ మళ్లీ వచ్చారు. బాబాయ్ ఇక లేరనే విషయాన్ని జగన్ నిలబడే మాకు చెప్పారు" అని అజేయ కల్లం ఇచ్చిన వాంగ్మూలాన్ని సీబీఐ జూన్ 30న కోర్టుకు సమర్పించింది.

# 'పెన్నా టు వంశధార'... ఆగష్టులో చంద్రబాబు ప్రాజెక్టుల సందర్శన..



అమరావతి: "పెన్నా టు వంశధార" పేరుతో చంద్రబాబు ప్రాజెక్టుల సందర్శన కార్యక్రమం చేపట్టనున్నట్లు టీడీపీ ఏపీ చీఫ్ అచ్చెన్నాయుడు తెలిపారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. ఆగస్టు 1 నుంచి పది రోజుల పాటు చంద్రబాబు ప్రాజెక్టుల సందర్శన చేపడతారని అన్నారు. కొన్ని ప్రాజెక్టులను ప్రీక్లోజర్ చేసేసిన విధానాన్ని ప్రజలకు చంద్రబాబు వివరిస్తారని చెప్పారు. చంద్రబాబు చేపట్టే పెన్నా టు వంశధార కార్యక్రమాన్ని పార్టీ కార్యక్రమంగా చూడొద్దని.. ప్రజా అవగాహన కార్యక్రమంగా చూడాలన్నారు. జగన్ సహా మంత్రులు.. వైసీపీ నేతలు దోపిడీనే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. వ్యవసాయ, సాగునీటి రంగాలను జగన్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. అన్నపూర్ణగా పేరొందిన ఏపీలో వ్యవసాయం, సాగునీటి రంగాలను జగన్ భ్రష్టు పట్టించారన్నారు. ప్రభుత్వాన్ని తాము ప్రశ్నిస్తే ఎదురు దాడి చేస్తున్నారన్నారు. ఎన్టీఆర్ హయాంలో ఇరిగేషన్ ప్రాజెక్టులకు బీజం పడిందని.. దాన్ని చంద్రబాబు కంటిన్యూ చేస్తున్నారని తెలిపారు. ఇరిగేషన్ రంగాన్ని ప్రభుత్వం ఎలా గాలికొదిలేసిందో చంద్రబాబు ఇప్పటికే వివరించారన్నారు.

మరోసారి ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా ప్రజల్లో అవగాహన కలిగిస్తారన్నారు. 2014-19 మధ్య కాలం ఇరిగేషనుకు స్వర్ణ యుగమన్నారు. జగన్ చెప్పేవన్నీ అబద్దాలే అంటూ మండిపడ్డారు. ఇంకేం ఖర్చు పెడతారు..? వర్షా కాలంలో ప్రాజెక్టులకు ఖర్చు పెట్టడం సాధ్యమా.. అని ప్రశ్నించారు. ఇరిగేషన్ ప్రాజెక్టులకు టీడీపీ హయాంలోనే ఎక్కువ ఖర్చు పెట్టారని జగనుకు అత్యంత ఆప్తుడైన ఈఎన్సీనే చెప్పారని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

# నన్ను ఆంబోతు అంటే.. చంద్రబాబు ఆంబోతులకు ఆవులను సరఫరా చేసినట్టే.. అంబటి ఫైర్





విజయవాడ: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుపై మంత్రి అంబటి రాంబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు ప్రెస్‌మీట్ పెట్టి తనను ఆంబోతు అన్నారని మండిపడ్డారు. ఎన్టీఆర్ అల్లుడు అవ్వడం మూలంగా చంద్రబాబు ముఖ్యమంత్రి కాగలిగారన్నారు. కిందిస్థాయి నుంచి వచ్చిన తనను ఇష్టానుసారం అంటారా అంటూ విరుచుకుపడ్డారు. "చంద్రబాబు నన్ను ఆంబోతు అన్నప్పుడు ఆయన ఆంబోతులకు ఆవులను సరఫరా చేసినట్టు కలిపి చదువుకోవాలి" అంటూ సెటైర్ విసిరారు. "నీ ఇంటి పేరు నారా కాదు శని ... శని చంద్రబాబు నువ్వు.. వచ్చే ఎన్నికల్లో ప్రజలు దృష్టిలో శనివి నిన్ను వదిలించుకుంటారు" అంటూ దుయ్యబట్టారు. పోలవరానికి, రాష్ట్రానికి చంద్రబాబే శని అంటూ వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబుకు చిత్తశుద్ధి పోలవరం మీద లేదని.. వచ్చే డబ్బుమీద ఉందన్నారు. తమ వారికి కాంట్రాక్టు ఇస్తే డబ్బులు వస్తాయని చంద్రబాబు పోలవరం చుట్టూ తిరిగారన్నారు. ఆర్ అండ్ ఆర్ రాష్ట్ర ప్రభుత్వం చేయాలంటే చంద్రబాబు వెళ్ళి ప్రెజెంటేషన్ చేస్తే అంగీకరించారా అని ప్రశ్నించారు. ప్రత్యేక హెూదాను వదులుకుని పోలవరం రాష్ట్ర ప్రభుత్వం కడుతుందని చెప్పుకొచ్చారన్నారు. పోలవరం ప్రాజెక్టుకు 2013-14 సంవత్సరం రేట్ల ప్రకారం 2016లో ఒప్పుకున్నాకని.. రూ.20,390 కోట్లకు కడతామని చంద్రబాబు ఒప్పుకున్నట్లు చెప్పారు. చంద్రబాబు పోలవరంను ఏటీఎంగా వినియోగించుకున్నారని కేంద్రం చెప్పిందన్నారు. ఇప్పుడు ప్రాజెక్టు రేటు 2017-18 రేట్ల ప్రకారం రూ.55,656 కోట్లు అయ్యిందని మంత్రి తెలిపారు. ఏటికేడు ప్రాజెక్టు రేటు పెరిగిపోతోందని చెప్పారు. కేంద్రం తీసుకోవాల్సిన ప్రాజెక్టును రాష్ట్రం ఎందుకు తీసుకుందో... చెప్పాలని డిమాండ్ చేశారు. 2018లో పోలవరం చంద్రబాబు పూర్తి చేస్తామన్నారని.. గత ప్రభుత్వంలోని వారంతా కలిసి పోలవరాన్ని ముంచేశారని విమర్శించారు. కాఫర్ డ్యాం కట్టకుండా డయాఫ్రం వాల్ ఎలా వేశారని నిలదీశారు. టీడీపీ హయాంలో పోలవరం 72 శాతం పూర్తిచేశామని అంటున్నారని... పూర్తి చేసింది కేవలం 48.39శాతం మాత్రమే అని తెలిపారు. చంద్రబాబు ఒక అబ్బాయిని అటు... ఇంకో అబ్బాయిని ఇటు పంపి వచ్చి అబద్దాలు ఆడుతున్నారన్నారు. పోతిరెడ్డి పాడు వరకూ రాజశేఖర్ రెడ్డి పాదయాత్ర చేశారని.. పోలవరం, పులిచింతలకు రాజశేఖర రెడ్డి శంఖుస్థాపన చేశారని గుర్తుచేశారు. 41.15 మొదటి స్టేజి ఎత్తు... త్వరలో కేంద్రం మరో రూ.10 వేల కోట్లు ఇస్తామన్నారన్నారు. డయాఫ్రంవాల్ పరిసర ప్రాంతాల్లో రిపేరుకు రూ.2002 కోట్లు ఇస్తామన్నారని తెలిపారు. 41.15కు మాత్రమే ప్రజెక్టు పూర్తవుతుందనడం కరెక్టు కాదన్నారు. ఆర్ అండ్ ఆర్‌కు ఆలస్యం మూలంగా పెరిగిన మొత్తాన్ని కేంద్రమే బరిస్తుందని మంత్రి అంబటి రాంబాబు పేర్కొన్నారు.




హమ్మయ్యా.. ఇన్నాళ్లకు బంగారం, వెండి ధరల్లో మార్పు వచ్చింది. అది కూడా పెరగలేదండోయ్... తగ్గింది. కొనుగోలుదారులకు అయితే ఇది మంచి శుభవార్త. బంగారం, వెండి ధరలు బులియన్ మార్కెట్‌లో రోజువారీ మార్పులు, చేర్పులకు లోనవుతూ ఉంటుందన్న విషయం తెలిసిందే. కానీ ఇటీవలి కాలంలో మాత్రం బంగారం, వెండి ధరలు స్థిరంగా ఒకచోటనే ఉండిపోయాయి. ఇవాళ మాత్రం తగ్గాయి. బంగారం కంటే కూడా వెండి బాగా తగ్గింది. కిలోపై ఏకంగా రూ.2000 తగ్గింది. ఇక నేడు 22 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు)పై రూ.350 తగ్గి రూ.55,100 ఉండగా.. 24 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు)పై రూ.380 తగ్గి రూ.60,110కి చేరుకుంది. ఇక కిలో వెండి ధరపై రూ.2000 తగ్గి రూ.76,400కి చేరుకుంది. ఇక దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయో చూద్దాం.

**బంగారం ధరలు..** హైదరాబాద్‌లో 22 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు) రూ.55,100.. 24 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు) రూ.60,110. విజయవాడలో 22 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు) రూ.55,100.. 24 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు) రూ.60,110. విశాఖపట్టణంలో 22 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు) రూ.55,100.. 24 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు) రూ.60,110. చెన్నైలో 22 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు) రూ.55,500.. 24 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు) రూ.60,550. కేరళలో 22 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు) రూ.55,100.. 24 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు) రూ.60,110. బెంగుళూరులో 22 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు) రూ.55,100.. 24 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు) రూ.60,110. కోల్‌కతాలో 22 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు) రూ.55,100.. 24 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు) రూ.60,110. ముంబైలో 22 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు) రూ.55,100.. 24 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు) రూ.60,110. ఢిల్లీలో 22 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు) రూ.55,250.. 24 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు) రూ.60,260. **వెండి ధరలు..** హైదరాబాద్‌లో కిలో వెండి ధర రూ.79,500. విజయవాడలో కిలో వెండి ధర రూ.79,500. విశాఖపట్టణంలో కిలో వెండి ధర రూ.79,500. చెన్నైలో కిలో వెండి ధర రూ.79,500. కేరళలో కిలో వెండి ధర రూ.79,500. బెంగుళూరులో కిలో వెండి ధర రూ.75,250. కోల్‌కతాలో కిలో వెండి ధర రూ.76,400. ముంబైలో కిలో వెండి ధర రూ.76,400. ఢిల్లీలో కిలో వెండి ధర రూ.76,400.




మదనపల్లె గ్రామీణ: అన్నమయ్య జిల్లాలోని మదనపల్లె మార్కెట్‌లో టమాటా ధర రికార్డు మోత మోగింది. శనివారం కిలో నాణ్యమైన టమాటా రూ.196 పలికింది. అత్యల్పంగా కిలో రూ.140 ధరను నమోదు చేసింది. దీంతో వినియోగదారుల్లో గుబులు మొదలైంది. మదనపల్లె మార్కెట్‌కు శనివారం కేవలం 253 టన్నుల సరకు మాత్రమే వచ్చింది. బయట ప్రాంతాల్లో దిగుబడి లేకపోవడం, మదనపల్లె ప్రాంతంలో సీజన్ చివరి దశ కావడం వంటి కారణాలతో ధరలు రికార్డు స్థాయిలో నమోదు అవుతున్నాయని వ్యాపారులు తెలిపారు. బయట ప్రాంతాల్లో దిగుబడి లేకపోవడం వల్ల ధరలు ఈ విధంగా పెరుగుతున్నాయని అధికారులు చెబుతున్నారు.

మదనపల్లె మార్కెట్‌లో మొదటి రకం కిలో టమాటా రూ. 160 - రూ. 196, రెండవ రకం రూ.120 - రూ.156 వరకు పలికింది. 25 కేజీల బుట్ట ధర రూ.4500 - రూ 4900తో వ్యాపారులు కొనుగోలు చేశారు.

# విశాఖ టూ కోస్తా దాకా...జనసేన లెక్క పక్కా...!

విశాఖపట్నం : ఏపీ లో మూడవ పార్టీగా బలంగా ఎమర్జ్ కావాలన్నది జనసేన వ్యూహం. ఈ విషయం లో మొహమాటం లేకుండానే ఆ పార్టీ తన పని తాను చేసుకుని పోతోంది. అందుకే సీట్ల దగ్గర పేచీ రావచ్చు అంటున్నారు. ఏపీ లో వైసీపీ టీడీపీ మాత్రమే పార్టీలు ఉన్నాయి. మూడవ పార్టీగా తాము బలంగా ఉండాలంటే 2024 ఎన్నికలు ఒక సోపానంగా వాడుకోవాల ని జనసేన చూస్తోంది. ఏపీ లో వైసీపీ ని గద్దె దించడం మాత్రమే జనసేన లక్ష్యం కాదు. దానితో పాటు తాను కూడా ఎదగాలని, కొత్త ప్రభుత్వంలో కీలక భూమిక పోషించాల ని భావిస్తోంది. అదే విధంగా ఏపీ రాజకీయాల్లో ప్రభావితం చేసేలా వీలైతే రానున్న మరిన్ని ఎన్నికల్లో అధికారం పూర్తి మెజారిటీతో చేపట్టే దిశగా జనసేన ప్రణాళికలు వేసుకుంటోంది. దాంతోనే ఇపుడు తన పాత్రకు ఏ మాత్రం కుదించుకోవడానికి ఇష్టపడడంలేదని అంటున్నారు. పొత్తుల కు జనసేన సుముఖం. అది కూడా టీడీపీ తో కలసి వెళ్ళేందుకు ఇంకా సుముఖం అన్నది ప్రచారంలో ఉన్న మాట. బీజేపీ టీడీపీల ను చెరో వైపు ఉంచుకుంటూ ఈ మూడు పార్టీల కలయికతో ఏపీలో బలమైన కూటమిగా మారి వైసీపీ ని గద్దె దించాలన్నదే జనసేన మాస్టర్ ప్లాన్. అయితే ఈ మొత్తం వ్యవహారం లో తాను ఎక్కడా నష్టపోకుండా జనసేన వ్యూహాత్మకంగానే అడుగులు వేస్తోంది. తన పార్టీ బలం ఉన్న చోట జనసేన ను నమ్ముకున్న సైనికులు ఉన్న చోట కచ్చితంగా వారి కోసం సీట్ల కోసం పట్టుబట్టాలనే భావిస్తోంది. దాని కోసం పొత్తుల విషయంలో తగ్గేదే లే అన్నట్లు ఉంది. అలా తీసుకుంటే విశాఖ లో భీమిలీ, గాజువాక. పెందుర్తి, అనకాపల్లి, ఎలమంచిలి సీట్లను జనసేన కోరుకుంటోంది. విజయనగరం, శ్రీకాకుళం కలిపి మొత్తం 19 సీట్లు ఉంటే ఇందులో కూడా ఒక అయిదు సీట్లను జనసేన పొత్తుల లో తీసుకునే చాన్స్ ఉంది. ఆయా సీట్లను గుర్తించారు అని అంటున్నారు. అలాగే గోదావరి జిల్లాల లో ఉన్న మొత్తం 34 సీట్లలో కనీసంగా ఇరవై సీట్లకు టెండర్ పెట్టేలాగానే వారాహి దూకుడు సాగింది. ఇక గుంటూరు లో తెనాలి, గుంటూర్ ఈస్ట్, వెస్ట్, ప్రత్తిపాడు సీట్ల మీద జనసేన కన్ను ఉందని అంటున్నారు. 2019 ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసినా ఇక్కడ జనసేనకు మంచి ఓట్లు వచ్చాయని లెక్కలు చెబుతున్నారు. క్రిష్ణా జిల్లాలో చూసుకుంటే విజయవాడ తూర్పు సీటుతో పాటు, మచిలీపట్నం, విజయవాడ వెస్ట్ సీట్ల మీద జనసేన చూపు ఉంది అని అంటున్నారు. అలాగే ప్రకాశం జిల్లాలో పర్చూరు, ఒంగోలు, దర్శి, చిత్తూరు జిల్లాలో తిరుపతి, నగరి కడప, కర్నూల్, అనంతపురంల లో జిల్లాకు రెండు సీట్లు వంతున ఆరు సీట్ల దాకా తీసుకోవాలన్నది జనసేన ప్లాన్ అని అంటున్నారు. ఈ విధంగా చూసుకుంటే టోటల్‌గా యాభై సీట్లు జనసేన కు పొత్తులో టీడీపీ ఇవ్వాల్సి ఉంటుంది. ఇక మాజీ మంత్రులు సీనియర్ నేతలు తెలుగుదేశం నుంచి త్యాగాల కు సిద్ధపడాల్సి ఉంటుంది. కొన్ని చోట్ల ఆ దిశగా తెలుగుదేశం నుంచి సర్దుబాట్లు జరుగుతున్నాయని అంటున్నారు. అయితే మరో వైపు నుంచి చూస్తే మాత్రం జనసేన కోరుకున్న సీట్లలో టీడీపీ గట్టిగా ఉండడం వల్ల ససేమిరా అనే పరిస్థితి కూడా ఉంది. మరి ఈ సీట్ల చిక్కుముడిని విప్పితేనే తప్ప పొత్తుల కథ కొలిక్కి వచ్చే అవకాశం లేదు ఇంకో విషయం ఏంటి అంటే జనసేన కోరుకుంటున్న సీట్ల జాబితా టీడీపీ వద్ద ఉంది అని అంటున్నారు. అందులో సగానికి సగం టీడీపీ ఇవ్వలేనివిగా ఉనాయని అంటున్నారు. మరి దీని మీద ఎవరు తగ్గుతారు. ఎవరు నెగ్గుతారు అన్న దాని బట్టే ముందు ముందు పరిణామాలు ఆధారపడి ఉన్నాయని అంటున్నారు.

# పోలవరం విలీన మండలాల ప్రజల కష్టాలు మీకు పట్టవా?



అమరావతి: పోలవరం విలీన మండలాల ప్రజల కష్టాలు జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి పట్టవా అంటూ సీపీఐ రాష్ట్ర కారదర్శి కె.రామకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. పోలవరం విలీన మండలాల ప్రజల పరిస్థితి ముందు నుయ్యి, వెనక గొయ్యిగా మారిందన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి ఏటపాక, చింతూరు, వర రామచంద్రపురం, కూనవరం మండలాలు ఏపీలో విలీనమయ్యాయని తెలిపారు.

ఆయా మండలాల ప్రజలు ప్రతి ఏటా గోదావరి వరద బారిన పడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. గత ఏడాది 70 అడుగుల మేర గోదావరి వరదలు వచ్చినప్పుడు జగన్ సర్కార్ కనీస చర్యలు చేపట్టలేదని మండిపడ్డారు. తెలంగాణ ప్రభుత్వం వరద బాధితులకు పునరావాసం, సహాయక చర్యలు చేపడుతుంటే ఏపీ ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరించడం దుర్మార్గమన్నారు. పోలవరం విలీన మండలాల ప్రజలకు శాశ్వత పరిష్కారం చూపాలని వైసీపీ ప్రభుత్వాన్ని రామకృష్ణ డిమాండ్ చేశారు.

# శంకర్ కూతురు ఏకంగా ఐదు సినిమాలు

కోలీవుడ్ ఇండస్ట్రీలో స్టార్ డైరెక్టర్ గా తనకంటూ ప్రత్యేకమైన బ్రాండ్ ని శంకర్ క్రియేట్ చేసుకున్నారు. భారీ బడ్జెట్ చిత్రాల కు కేరాఫ్ అడ్రస్ గా సౌత్ ఇండస్ట్రీలో శంకర్ పేరు వినిపిస్తూ ఉంటుంది. సౌత్ లో ఫస్ట్ టైం 100 కోట్లకు పైగా బడ్జెట్ తో సినిమా చేసిన డైరెక్టర్ గా శంకర్ గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రస్తుతం ఆయన రెండు పాన్ ఇండియా సినిమాల ను తెరకెక్కిస్తున్నారు. గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ తో గేమ్ చేంజర్ మూవీ షూటింగ్ దశలో ఉంది. దిల్ రాజు ఈ చిత్రాన్ని 200 కోట్ల భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. మరోవైపు కమల్ హాసన్ హీరోగా ఇండియన్ 2 మూవీ కూడా తెరకెక్కుతోంది. సుమారు 300 కోట్లు ఈ సినిమా కోసం సన్ పిక్చర్స్ ఖర్చుపెడుతోంది. ఇదిలా ఉంటే డైరెక్టర్ శంకర్ కూతురు అదితి శంకర్ ప్రస్తుతం తమిళ్ ఇండస్ట్రీలో హీరోయిన్ గా అడుగుపెట్టింది. రీసెంట్ గా శివ కార్తికేయన్ హీరోగా వచ్చిన మహావీరుడు సినిమా లో అదితి శంకర్ నటించింది.



దీనికంటే ముందు మరో చిత్రం లో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అయితే నటిగా ఆమె ఆశించిన స్థాయిలో ప్రేక్షకుల ను మెప్పించలేదని చెప్పాలి. కానీ మరో మూడు సినిమాలు అదితి శంకర్ చేతి లో ఉ ండడం విశేషం. ఇవన్నీ కూడా షూటింగ్ దశలోనే ఉన్నాయి. అయితే ఈ బ్యూటీకి కేవలం తండ్రి బ్రాండ్ ఇమేజ్ కారణంగానే అవకాశాలు వస్తున్నాయని ప్రచారం తమిళ ఇండస్ట్రీలో జోరుగా వినిపిస్తోంది. నటిగా మెప్పించ లేకపోయిన కూడా శంకర్ మీద ఉన్న రెస్పెక్ట్ తో అదితి శంకర్ కి హీరోయిన్ గా అవకాశాలు ఇస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే ఈ విమర్శల కు అదితి శంకర్ ఫుల్ స్టాప్ పెట్టాల్సిన అవసరం ఉంది. సౌత్ ఇండస్ట్రీలో ఫ్యామిలీ బ్యాగ్రౌండ్ నుంచి హీరోయిన్స్ గా వచ్చిన తారలు చాలా తక్కువ మంది. ఐశ్వర్య రాజేష్ తమిళ్ లో స్టార్ హీరోయిన్ గా ఉంది. అయితే ఆమె తండ్రి చనిపోయిన తర్వాత సినిమా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది. ఇప్పుడు అదితి శంకర్ కూడా తండ్రి ఇమేజ్ తోనే హీరోయిన్ గా టాలీవుడ్ లోకి అడుగుపెడుతున్న తన మార్క్ చూపించుకుని ప్రయత్నం చేస్తోంది. నెక్స్ట్ రాబోయే సినిమాల తో కచ్చితంగా నటిగా తనని తాను ప్రూవ్ చేసుకోవడానికి రెడీ అవుతోంది.

## ఎక్కువ సినిమాలు చేయాలని లేదు

సూపర్ స్టార్ మహేష్ బాబు గుంటూరు కారం సినిమాలో అనూహ్యంగా చోటు దక్కించుకున్న మీనాక్షి చౌదరి ప్రస్తుతం టాలీవుడ్ లో మోస్ట్ క్రేజీ బ్యూటీస్ సరసన చోటు సంపాదించింది. హీరోయిన్ గా ఈ అమ్మడి యొక్క జోరు మామూలుగా లేదు. ఇచ్చట వాహనాలు నిలుపరాదు సినిమా తో ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ఈ అమ్మడు హిట్ 2 తో హిట్ సొంతం చేసుకుంది. హిట్ 2 తర్వాత.. అంతకు ముందు కూడా తన వద్దకు చాలా సినిమా ఆఫర్లు వచ్చాయట. కానీ కథలో ప్రాముఖ్యత లేని పాత్రలు చేయడం... నటనకు ఆస్కారం లేని పాత్రలు చేయడం అస్సలు ఇష్టం లేదట. అందుకే కొన్ని సినిమాలను



కాదనుకున్నట్లుగా ఒక ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది. ఎక్కువ సినిమాలు చేయాలని తనకు లేదని.. ప్రేక్షకుల మనసుకు నచ్చే సినిమాలు చేయాలి అనేది తన కోరిక. గుంటూరు కారం సినిమా లో తనకు మంచి గుర్తింపు లభిస్తుందని ఆశిస్తున్నట్లుగా పేర్కొంది. బోల్డ్ పాత్రల్లో నటించేందుకు ఆసక్తి చూపించని ఈ అమ్మడు నటనకు ఆస్కారం ఉన్న పాత్రల్లో నటించేందుకు సిద్ధం అన్నట్లుగా తాజా ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది. మహేష్ బాబు సినిమాలో ఈమె పాత్రకు ఎంత ప్రాముఖ్యత ఉంటుందో చూడాలి. ప్రస్తుతానికి మహేష్ బాబు సినిమా మాత్రమే చేస్తుంది. ఒకటి రెండు సినిమాలకు సంబంధించిన స్క్రిప్ట్ వర్క్ జరుగుతుందని... చర్చలు జరుగుతున్నాయని తెలుస్తోంది. మొత్తానికి ఈ అమ్మడు గుంటూరు కారం సినిమా తర్వాత వరుస సినిమాలతో బిజీ అయ్యే అవకాశాలు ఉన్నాయి. కానీ ఈమె మాత్రం పాత్ర కు ప్రాముఖ్యత... కథలో ప్రాముఖ్యత అంటున్న కారణంగా ఎంత వరకు అవకాశాలు వస్తాయో చూడాలి.




# ఎన్.టి.ఆర్ దేవర.. ఇది సరిపోదు..!



ఆర్.ఆర్.ఆర్ తో పాన్ ఇండియా లోనే కాదు హాలీవుడ్ లో కూడా ప్రభంజనం సృష్టించారు రాం చరణ్, ఎన్.టి.ఆర్. ఇద్దరు హీరోలకు ఈ సినిమా ఇంటర్నేషనల్ క్రేజ్ వచ్చేలా చేసింది. అందుకే నెక్స్ట్ వీరిద్దరు చేస్తున్న సినిమాల మీద ఆ ఇంప్యాక్ట్ కనిపిస్తుంది. ఆర్.ఆర్.ఆర్ తర్వాత చరణ్ ఆల్రెడీ ఆచార్య చేశాడు. అది కాస్త నిరాశపరచింది. ప్రస్తుతం రాం చరణ్ శంకర్ డైరెక్షన్ లో గేమ్ చేంజర్ సినిమా చేస్తున్నాడు. ఈ సినిమాతో మరోసారి చరణ్ తన సత్తా చాటబోతున్నాడని తెలుస్తుంది. ఇక ఎన్.టి.ఆర్ విషయానికి వస్తే కొరటాల శివతో దేవర అంటూ ఒక భారీ ప్రాజెక్ట్ షురూ చేశాడు తారక్. యువ సుధ ఆర్ట్స్, ఎన్.టి.ఆర్ ఆర్ట్స్ కలిసి నిర్మిస్తున్న ఈ సినిమాకు దేవర టైటిల్ ఫిక్స్ చేశారు. ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్ సినిమాపై భారీ క్రేజ్ తెచ్చిపెట్టింది. నేషనల్ వైడ్ గా ఎన్.టి.ఆర్ కి ఉన్న ఇమేజ్ కి ఈ సినిమా పర్ఫెక్ట్ అని చెప్పుకునేలా చేసింది. అయితే స్టార్ సినిమా అంటే సినిమాకు క్లాప్ కొట్టిన నాటి నుంచి రిలీజ్ వరకు సినిమా గురించి ఫ్యాన్స్ లో డిస్కషన్ జరిగేలా ప్రమోషన్స్ చేయాలి. సినిమా పోస్టర్స్, సాంగ్స్ అవి కుదరకపోతే సినిమా అప్డేట్స్ తో అయినా ఫ్యాన్స్ ని ఖుషి చేయాల్సి ఉంటుంది. సినిమా నుంచి వచ్చే అప్డేట్ తో ఫ్యాన్స్ అంతా కూడా ఆ సినిమాకు ఎంగేజ్ అయ్యి ఉంటారు. కానీ దేవర విషయంలో అది మిస్ అవుతుంది. దేవర ఫస్ట్ లుక్ పోస్టర్ వదిలిన కొరటాల శివ మళ్లీ షూటింగ్ తో బిజీగా ఉన్నాడు తప్ప సినిమా అప్డేట్ మాత్రం ఇవ్వట్లేదు. దేవర గురించి ఫ్యాన్స్ కోరుతున్న అప్డేట్స్ ఇస్తూ ఫ్యాన్స్ కి సినిమాపై ఒక క్రేజ్ వచ్చేలా చేయాల్సి ఉంది. కానీ కొరటాల శివ ఆ విషయంలో చాలా వెనకపడి ఉన్నాడు. అయితే ఇవేమి చేయకపోయినా సినిమా అవుట్ పుట్ బాగుంటే మాత్రం రికార్డులు కొట్టడం ఖాయం.

కానీ ఎన్.టి.ఆర్ లాంటి స్టార్ సినిమా ఏం జరుగుతుంది అన్న ఎగ్జైట్ మెంట్ ఫ్యాన్స్ లో ఉంటుంది. అందుకోసమైనా ఏదో ఒక చిన్న అప్డేట్ లాంటిది ఇస్తే ఫ్యాన్స్ ఖుషి అవుతారు. 2024 ఏప్రిల్ 5న దేవర రిలీజ్ ఫిక్స్ చేశారు. అయితే రిలీజ్ చాలా టైం ఉ ంది కదా ఇప్పుడే ప్రమోషన్స్ ఎందుకు అనుకుంటున్నారేమో కానీ సినిమాను ఎంత ప్రేక్షకుల్లోకి తీసుకెళ్తే అంత క్రేజ్ వస్తుందనే లాజిక్ మిస్ అవుతున్నారు దేవర టీం.

# మిస్ శెట్టి.. మిస్టర్ శెట్టి.. మళ్లీ అదే తంతు!




విభిన్న కథలను ఎంచుకుంటూ టాలీవుడ్ లో దూసుకుపోతున్న యువ హీరో నవీన్ పొలిశెట్టి. ఆయన హీరోగా, స్టార్ హీరోయిన్ అనుష్క జంటగా కలిసి నటిస్తున్న చిత్రం మిస్ శెట్టి మిస్టర్ పొలి శెట్టి. ఈ సినిమాతో అనుష్క చాలా కాలం తర్వాత తెరపై కనిపించనుందది. అందులోనూ అనుష్క లాంటి స్టార్ హీరోయిన్, యువ హీరో నవీన్ పొలిశెట్టితో చేయడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఇప్పటికే రిలీజ్ చేసిన టీజర్, ట్రైలర్ లు విపరీతంగా ఆకట్టుకున్నాయి. ప్రముఖ నిర్మాణ యువీ క్రియేషన్స్ బ్యానర్‌పై మహేష్ బాబు.పి దర్శకత్వంలో వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా మరోసారి వాయిదా పడింది. నిజానికి, ఈ సినిమా ప్రపంచ వ్యాప్తంగా ఆగస్ట్ 4న విడుదల కావాల్సి ఉండగా, మరోసారి వాయిదా పడింది. నిజానికి గతంలో ఓసారి వాయిదా పడింది. ఆ వాయిదా పడిన తర్వాత, ఆగస్టు 4వ తేదీన విడుదల చేస్తామని ప్రకటించారు. ఇప్పుడు ఈ తేదీని కూడా వాయిదా వేయడం విశేషం. కొత్త తేదీని ఇప్పటి వరకు ప్రకటించలేదు. అసలు మూవీని ఎందుకు వాయిదా వేశారు అనే విషయాన్ని కూడా మేకర్స్ చెప్పక్కపోవడం గమనార్హం. మరి, ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు ఎప్పుడు వస్తుందో చూడాలి. ఇదిలా ఉండగా, మూవీ ట్రైలర్, టీజర్లు మాత్రం విపరీతంగా ఆకట్టుకున్నాయి. రామ్ చరణ్ సైతం టీజర్ చూసి తనకు ఎంతో బాగా నచ్చింది అంటూ కామెంట్ చేయడం విశేషం. ఈ మూవీకి సంబంధించి ఇప్పటి వరకు మూడు పాటలు విడుదల చేశారు. వాటికి మంచి రెస్పాన్సే వచ్చింది. మరీ సూపర్ గా లేకపోయినా, ఆకట్టుకునేలా ఉన్నాయి. అనుష్క చాలా కాలం తర్వాత నటిస్తున్న మూవీ కావడంతో ఫ్యాన్స్ కూడా ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారు. ఈ సినిమాలో అనుష్క చెఫ్ పాత్రలో నటిస్తుండగా, నవీన్ పొలిశెట్టి స్టాండప్ కమెడియన్ గా కనిపిస్తున్నారు. అన్విత రవళి శెట్టి పాత్రలో అనుష్క.. స్టాండప్ కమెడియన్ సిద్ధు పొలిశెట్టి పాత్రలో నవీన్ పొలిశెట్టి కనిపించనున్నారు. పి మహేష్ దర్శకత్వంలో యువి క్రియేషన్స్ బ్యానర్ లో తెరకెక్కుతున్న ఈ చిత్రంపై మంచి అంచనాలు ఉన్నాయి. వీరిద్దరి మధ్య కెమిస్ట్రీ ఎలా ఉండబోతోంది.. అసలు ఈ చిత్రంలో అనుష్క గ్లామర్.. నవీన్ కామెడీ టైమింగ్ ఎలా ఉ ండబోతున్నాయి అనే ఉత్కంఠ తీరాలి అంటే, మూవీ ప్రేక్షకుల ముందుకు వచ్చే వరకు ఆగాల్సిందే.

# రష్మిక కూడా అదే తప్పు చేస్తుందా..?

కన్నడ భామ రష్మిక మందన్న తెలుగులో అనతికాలంలోనే స్టార్ క్రేజ్ దక్కించుకుంది. నాగ శౌర్య, విజయ్ దేవరకొండ, నాని లాంటి హీరోలతో నటిస్తూ ఆ నెక్స్ట్ వరుస స్టార్ అవకాశాలను అందుకుంది. తనకు వచ్చిన పాత్రలకు పూర్తిస్థాయిలో న్యాయం చేస్తూ వచ్చిన రష్మిక అలా టాప్ 3 హీరోయిన్స్ లిస్ట్ లో చేరింది. లాస్ట్ ఇయర్ ఆడవాళ్లు మీకు జోహార్లు, సీతారామం రెండు సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన రష్మిక ఆ సినిమాల్లో ఒకటి హిట్ మరోటి ఫెయిల్యూర్ రిజల్ట్ అందుకుంది. సీతారామం లో హీరోయిన్ పాత్ర కాకుండా సపోర్టింగ్ రోల్ చేయడం మంచి విషయం. తెలుగులో మంచి ఫాం లో ఉన్న టైం లోనే బాలీవుడ్ ఆఫర్లు రావడం వాటికి ఓకే చెప్పడం చేసిన రష్మిక ఏడాదిన్నర అవుతున్నా ఒక్క తెలుగు



సినిమా సై చేయలేదు. నితిన్ వెంకీ కుడుముల సినిమా చేస్తుందని అనుకోగా ఆ ప్రాజెక్ట్ నుంచి కూడా ఆమె ఎగ్జిట్ అయినట్టు తెలుస్తుంది. తెలుగులో రష్మిక కొనసాగాలని అనుకోవడం లేదా టాలీవుడ్ పై అప్పుడే రష్మిక ప్రేమ తగ్గిపోయిందా అని కామెంట్ చేయడం మొదలు పెట్టారు. కొద్దిగా స్టార్ క్రేజ్ వచ్చిన తర్వాత వచ్చిన ఆఫర్లను చేయకుండా సినిమాలో అది ఉండాలి ఇది ఉండాలి అని హీరోయిన్స్ సినిమాలను రిజెక్ట్ చేయడం తెలిసిందే. స్టార్ హీరోయిన్స్ విషయంలో కూడా అది రిపీట్ అవుతూ వస్తుంది.

రష్మిక కూడా ఈమధ్య తన దగ్గరకు వచ్చిన రెండు సినిమాలను కాదనేసిందని టాక్. అయితే ఆ సినిమాల కథ నచ్చలేదో లేదా మరో కారణమో తెలియదు కానీ తెలుగులో అసలు సినిమాలు లేని టైం లో వచ్చిన ఆఫర్ ని కాదనడం రష్మిక గురించి అందరు మాట్లాడుకునేలా చేస్తుంది. రష్మిక కూడా ఇంతకుముందు హీరోయిన్స్ చేసిన పొరపాట్లను చేస్తుందని అంటున్నారు. నేషనల్ క్రష్ రష్మిక నెక్స్ట్ తెలుగు సినిమా కోసం ఆమె ఫ్యాన్స్ అంతా కూడా ఈగర్ గా ఎదురుచూస్తున్నారు. నితిన్ సినిమా నుంచి దాదాపుగా ఆమె తప్పుకున్నట్టే అని తెలుస్తుండగా రష్మిక చేజార్చుకున్న ఈ ఛాన్స్ ని మీనాక్షికి వరించిందని టాక్. ఇలా రష్మిక లైట్ తీసుకుంటే మాత్రం టాలీవుడ్ లో కెరీర్ రిస్క్ లో పడే ఛాన్స్ ఉంది. సో రష్మిక ఇక మీదట జాగ్రత్త పడకపోతే మాత్రం జరగాల్సిన నష్టం జరిగాక ఎంత ప్రయత్నించినా సరే వర్క్ అవుట్ అవ్వదని చెప్పొచ్చు.

# వరల్డ్ బిగ్గెస్ట్ డైమండ్ సీక్రెట్ రివీల్ చేసిన మిల్కీ బ్యూటీ

వరల్డ్స్ బిగ్గెస్ట్ డైమండ్ సీక్రెట్ రివీల్ చేసిన మిల్కీ బ్యూటీ మిల్కీ బ్యూటీ తమన్నా కు ప్రముఖ టాలీవుడ్ స్టార్ రామ్ చరణ్ భార్య ఉపాసన కామినేని కొణిదెల అరుదైన డైమండ్ ను బహుమానంగా ఇచ్చారని... ఆ డైమండ్ ప్రపంచంలోనే అయిదవ అతి పెద్దదిగా ప్రచారం జరిగింది. సోషల్ మీడియాలో జరిగిన ప్రచారం కు చాలా మంది ఆశ్చర్యపోయారు. ఉపాసన కు అంత గొప్ప డైమండ్ ఇవ్వగలిగే సామర్థ్యం.. సత్తా ఉంది. కానీ తమన్నా కు ఎందుకు అంత పెద్ద డైమండ్ ను ఉపాసన ఇచ్చి ఉంటారు అనేది పెద్ద ప్రశ్న. ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానం స్వయంగా తమన్నా ఇచ్చింది. సోషల్ మీడియా ద్వారా తమన్నా మరోసారి ఆ డైమండ్ ను చూపిస్తూ సీక్రెట్ ను రివీల్ చేయడంతో అంతా కూడా అంతేనా అంటూ నిటూర్చుతున్నారు. అసలు విషయం ఏంటంటే.. అది డైమండ్ కానే కాదు. అది ఒక బాటిల్ ఓపెనర్. చూడ్డానికి డైమండ్ మాదిరిగా విభిన్నమైన ఆకారంలో ఉంది. తమన్నా ఆ బాటిల్ ఓపెనర్ ను



మరోసారి చేతికి ధరించి ఫోటోకు ఫోజ్ ఇచ్చి మాకు దీనికి విచ్చిన్నం చేయడం ఇష్టం లేదు. బాటిల్ ఓపెనర్ తో కూడా ఫోటోలకు ఫోజ్ లు ఇస్తాను అన్నట్లుగా తమన్నా సరదా కామెంట్ ని షేర్ చేసింది. మొత్తానికి ఆ డైమండ్ ప్రపంచంలోనే అతిపెద్ద డైమండ్స్ లో 5వ అతి పెద్దది కాదని.. అసలు అది అసలు డైమండ్ కాదని తేలిపోయింది. అయినా కూడా సోషల్ మీడియాలో మిల్కీ బ్యూటీ తమన్నా ఆ బాటిల్ ఓపెనర్ ధరించి ఉన్న ఫోటోలు తెగ వైరల్ అవుతూనే ఉన్నాయి. ఇక ఈ అమ్మడి సినిమాల విషయానికి వస్తే మెగాస్టార్ చిరంజీవి తో నటించిన భోళా శంకర్.. రజినీకాంత్ తో నటించిన జైలర్ సినిమాలు ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. ఇటీవలే ఈమె నటించిన లస్ట్ స్టోరీస్ 2 వెబ్ సిరీస్ ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెల్సిందే. మొత్తానికి ఈ అమ్మడు ఇండస్ట్రీ లో అడుగు పెట్టి ఇన్నాళ్లు అయినా కూడా ఇంకా బిజీ బిజీగా ఆఫర్లు దక్కించుకుంటూ భారీ రెమ్యూనరేషన్ తో దూసుకు పోతూనే ఉంది.



## భద్రాచలం వద్ద గోదావరి ఉగ్రరూపం!

భద్రాచలం: గోదావరి ఉగ్రరూపం దాల్చింది. భద్రాచలం వద్ద ప్రస్తుతం మూడో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. ఎగువ నుంచి వస్తున్న భారీ ప్రవాహంతో శుక్రవారం రాత్రి 8.43 గంటలకు నీటి మట్టం 53.01 అడుగులకు, ప్రవాహం 14.32 లక్షల క్యూసెక్కులకు చేరింది. దీంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ ప్రియాంక అల మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఆ తర్వాత ప్రతిగంటకూ గోదావరి వరద తీవ్రత పెరుగుతూ వస్తోంది. శనివారం ఉదయం 6 గంటలకు నీటిమట్టం 54.3 అడుగులకు చేరుకుంది. 8 గంటల వరకు ఇదే వరద, ఇదే నీటిమట్టం నిలకడగా కొనసాగుతోంది. ఎగువ ప్రాంతాల్లోని ఏటూరునాగారం, పేరూరు నుంచి వరద వస్తుండటంతో.. 55 అడుగులకు వరద చేరుకుంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో రాత్రి 8 గంటల వరకు ముంపు ప్రాంతాల్లోని 11,505 మంది బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించినట్లు వెల్లడించారు. భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ ప్రియాంక, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ ఇక్కడే మకాం పెట్టి ఎప్పటికప్పుడు సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. అత్యవసర సేవల నిమిత్తం హెలికాప్టర్‌తోపాటు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. గోదావరి పరీవాహకంలో సింగూరు మినహా నిజాంసాగర్, శ్రీరామసాగర్, కడెం, ఎల్లంపల్లి, దిగువమానేరు, సుందిళ్ల (పార్వతి), అన్నారం (సరస్వతి), మేడిగడ్డ (లక్ష్మి) ఇలా అన్ని బ్యారేజీల గేట్లు ఎత్తి నీటిని వదులుతున్నారు.

**నిలిచిన రాకపోకలు :** మరోవైపు, గోదావరి ఉద్ధృతికి తెలంగాణ – ఛత్తీస్‌గఢ్ ప్రధాన రహదారిపైకి వరద నీరు చేరింది. ఫలితంగా తెలంగాణ – ఛత్తీస్‌గఢ్ మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.



## భాజపా జాతీయ ప్రధాన కార్యదర్శిగా బండి సంజయ్

దిల్లీ: భాజపా జాతీయ కార్యవర్గాన్ని ఆ పార్టీ అధిష్ఠానం ప్రకటించింది. ఇందులో తెలుగు రాష్ట్రాల నుంచి పలువురికి చోటుదక్కింది. తెలంగాణ భాజపా మాజీ అధ్యక్షుడు బండి సంజయ్‌ను కొత్తగా జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమించింది. జాతీయ ఉపాధ్యక్షురాలిగా డీకే అరుణ (తెలంగాణ), జాతీయ ప్రధాన కార్యదర్శులుగా తరుణ్ చుగ్, సునీల్ బన్సల్, కార్యదర్శిగా సత్యకుమార్ (ఏపీ)ను కొనసాగించనున్నట్లు వెల్లడించింది. అలాగే, పార్టీ వ్యవహారాల ప్రధాన కార్యదర్శిగా బీఎల్ సంతోష్, సంస్థాగత వ్యవహారాల ఉప ప్రధాన కార్యదర్శిగా శివప్రకాశ్‌ను కొనసాగించనున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఉత్తర్వులు జారీ చేశారు.



## నడిసంద్రంలో చిక్కుకున్న 36 మంది..

చెన్నై: చేపలవేటకు వెళ్లి నడిసముద్రంలో రెండు రోజుల పాటు చిక్కుకున్న 36 మంది మత్స్యకారులను భారత నౌకాదళ సిబ్బంది సురక్షితంగా కాపాడారు. ఐఎన్ఎస్ ఖంజర్ సాయంతో 30 గంటలపాటు శ్రమించి మత్స్యకారుల పడవలను ఒడ్డుకు లాక్కొచ్చారు. తమిళనాడులోని నాగపట్టణం తీరం నుంచి 36 మంది మత్స్యకారులు మూడు పడవల్లో ఇటీవల చేపల వేట కోసం సముద్రంలోకి వెళ్లారు. సముద్రంలో వాతావరణ పరిస్థితులు సరిగా లేకపోవడంతో పాటు ఇంధనం లేకపోవడం, ఇంజిన్ సమస్య తలెత్తడంతో వీరి పడవలు నిలిచిపోయాయి. అలా రెండు రోజుల పాటు వారు బంగాళాఖాతంలో చిక్కుకున్నారు. మత్స్యకారుల చిక్కుకున్నట్లు సమాచారం రాగానే నౌకాదళం అప్రమత్తమైంది. బంగాళాఖాతంలో విధుల్లో ఉన్న ఎన్ఐఎస్ ఖంజర్‌ను సహాయక చర్యలకు పంపింది. వీరు మత్స్యకారుల కోసం గాలింపు చేపట్టగా తమిళనాడు తీరానికి దాదాపు 130 నాటికల్ మైళ్ల దూరంలో మూడు పడవలు కన్పించాయి.

వెంటనే నౌకాదళ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. ఆ మూడు బోట్లకు తాళ్లు కట్టి 30 గంటలకు పైగా లాక్కుంటూ చెన్నై హార్బర్‌కు తీసుకొచ్చారు. మత్స్యకారులు సురక్షితంగా ఉన్నారని నేవీ అధికార ప్రతినిధి కమాండర్ వివేక్ మంధ్వాల్ వెల్లడించారు.



## కిషన్‌రెడ్డిని కలిసిన జయసుధ.. బీజేపీలో చేరనున్నారా?

హైదరాబాద్ : త్వరలోనే తెలంగాణలో ఎన్నికలు రానున్నాయి. ఇప్పటికే అన్ని పార్టీలు ఆపరేషన్ ఆకర్ష్‌కు పదును పెట్టాయి. బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డిని ప్రముఖ సినీ నటి జయసుధ కలవడం తీవ్ర కలకలం రేపింది. జయసుధ బీజేపీలో చేరే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. 2009లో కాంగ్రెస్ నుంచి సికింద్రాబాద్ ఎమ్మెల్యేగా జయసుధ విజయం సాధించారు. అయితే గతంలో కూడా జయసుధ బీజేపీలో చేరుతారంటూ హడావుడి నడిచింది ఆ తరువాత ఏమైందో ఏమో కానీ అంతా సైలెంట్ అయిపోయింది. గతంలో కూడా జయసుధ, ఉత్తర తెలంగాణకు చెందిన ఒక సినీ నిర్మాతతో బీజేపీ చేరికల కమిటీ సభ్యులు మంతనాలు జరిపినట్టు ఆ పార్టీ వర్గాలు వివరించాయి. జయసుధ 2009లో సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరఫున ఎమ్మెల్యేగా గెలుపొందిన విషయం తెలిసిందే. కాగా, బీజేపీలో చేరాలన్న ఆ పార్టీ నేతల ప్రతిపాదనపై అప్పట్లో జయసుధ ఎలాంటి స్పష్టత ఇవ్వలేదని కమలం వర్గాలు పేర్కొన్నాయి. తనకు పార్టీ జాతీయ నాయకత్వం నుంచి విస్పష్ట హామీ ఇవ్వాలని ఆమె కోరినట్లు అప్పట్లో టాక్ నడిచింది.

## కరీంనగర్‌లో ఈటల పర్యటన.. బీఆర్ఎస్ సర్కార్‌పై ఆగ్రహం



కరీంనగర్: జిల్లాలోని జమ్మికుంట, ఇళ్ళందకుంట మండలాల్లో ఎమ్మెల్యే ఈటల రాజేందర్ పర్యటించారు. వర్షాలకు తెగిన రోడ్లు, బ్రిడ్జి, కల్వర్టులను ఈటల పరిశీలించారు.

జమ్మికుంట హౌసింగ్ బోర్డు, అంబేద్కర్ కాలనీల్లో ఇండ్లు నీట మునిగిన బాధితులను పరామర్శించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఇండ్లు నీట మునిగిన బాధితుల పట్ల ప్రభుత్వ స్పందన కరువని విమర్శించారు. బాధితులను ఫంక్షన్ హాల్లో పెట్టి అన్నం పెట్టారని.. పరిహారానికి మాత్రం దిక్కు లేదన్నారు. ఒక్కో బాధిత కుటుంబానికి రూ.25 వేలు అందజేయాలని డిమాండ్ చేశారు. తెగిన రోడ్లు, చెరువులు, కల్వల ప్రాజెక్ట్ మరమ్మత్తులు చేపట్టాలన్నారు. చెరువుల కింద ఉన్న వ్యవసాయ భూములు కోతకు గురయ్యాయన్నారు. ప్రభుత్వం మాటలు గొప్పగా ఉంటాయని.. కానీ చేతల్లో మాత్రం ఏమీ చెయ్యరని ఈటల రాజేందర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

## భద్రకాళి చెరువుకు గండి.. పలు కాలనీలకు వరదల



వరంగల్ కార్పొరేషన్: వరంగల్‌లో గత నాలుగు రోజుల కురిసిన భారీ వర్షాలకు భద్రకాళి చెరువు పూర్తిగా నిండింది. ఏడురోజుల పాటు చెరువు అలుగు పోసింది. ఈ క్రమంలోనే శనివారం ఉదయం వరంగల్‌లోని పోతన నగర్ వైపు భద్రకాళి చెరువు కట్టకు గండి పడింది. 10 నుంచి 15 మీటర్ల మేర కట్ట తెగటంతో వరద అంతా సమీపంలో ఉన్న పోతనగర్ రాజీవ్ కాలనీ, సరస్వతి కాలనీలకు చేరింది. ఈ నేపథ్యంలో గండిని పూడ్చేందుకు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఇసుక బస్తాలను వేసి వరద నివారణ చర్యలను చేపట్టింది. నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉన్నందున కాలనీ వాసులను ఇళ్లు నుంచి అధికారులు ఖాళీ చేయిస్తున్నారు.

మరోవైపు, చెరువుకు గండి పడటంతో సమీప కాలనీల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికే చెరువును పరిశీలించిన కలెక్టర్ స్నిక్తా పట్నాయక్.. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు.

## కిషన్ రెడ్డి గురువు కిరణ్ కుమార్ రెడ్డి.. చంద్రబాబు శిష్యుడు రేవంత్ రెడ్డి: హరీశ్ రావు





గజ్వేల్: రైతు వ్యతిరేక చట్టాలతో వేలాది రైతుల చావుకు బీజేపీ కారణమైందని మంత్రి హరీశ్ రావు అన్నారు. మూడు గంటల కరెంటు చాలంటూ కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రజలకు శాపంగా మారిందని చెప్పారు. తెలంగాణ ప్రజల సంక్షేమానికి కృషిచేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ప్రజలు దీవించాలన్నారు. సిద్దిపేట జిల్లా పర్యటనలో భాగంగా ములుగు మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్, వర్గల్ మండలం గౌరారంలో సర్కిల్ పోలీస్ స్టేషన్ భవన నిర్మాణ పనులకు మంత్రి మహమూద్ అలీతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం గజ్వేల్ మండలం శ్రీగిరిపల్లిలో గ్రామపంచాయతీ కార్యాలయాన్ని మంత్రి హరీశ్ రావు ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. చంద్రబాబు, కిరణ్ కుమార్ రెడ్డిలను అడ్డం పెట్టుకుని ప్రతిపక్షాల నాయకులు తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. తెలంగాణ బీజే పీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి చెప్పినట్లు వింటున్నారని, మరోవైపు చంద్రబాబు చెప్పినట్లు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి వింటున్నారని విమర్శించారు. కిషన్ రెడ్డి గురువు కిరణ్ కుమార్ రెడ్డి అని, చంద్రబాబు శిష్యుడు రేవంత్ రెడ్డి అని.. వీరిద్దరితో తెలంగాణ బతుకులు ఆగమైతాయని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్ర ప్రజల సంక్షేమంపై ముందు చూపుతో ఎవరు వ్యవహరిస్తున్నారో ప్రజలు ఆలోచించాలన్నారు.

## రాహుల్‌కు పెళ్లి చేద్దామా..? సోనియా గాంధీ ఏం చెప్పారంటే?





కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పెళ్లి ప్రస్తావన మరోసారి చర్చకు వచ్చింది. ఇటీవల గాంధీ కుటుంబాన్ని కలిసేందుకు వచ్చిన హరియాణా మహిళా రైతులు.. సోనియా గాంధీతో మాట్లాడుతూ రాహుల్ వివాహం గురించి అడిగారు. మరి దానికి ఆమె ఏం సమాధానం చెప్పారో తెలుసా..? జులై ఆరంభంలో రాహుల్‌గాంధీ హరియాణాలో పర్యటించిన సమయంలో.. సోనీపత్ జిల్లా మదీనా గ్రామ మహిళా రైతులు దిల్లీకి రావాలని ఉందని చెప్పారు. దాంతో ఆయన వారిని సోనియా నివాసానికి ఆహ్వానించగా.. ఇటీవల ఆ మహిళలంతా దిల్లీ వెళ్లిన విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించిన పూర్తి వీడియోను రాహుల్ తాజాగా షేర్ చేశారు. హరియాణా నుంచి వచ్చిన ఆ మహిళలు ముందుగా దిల్లీలోని పలు ప్రాంతాలను సందర్శించారు. అనంతరం 10 జన్‌పథ్‌లోని సోనియా నివాసానికి చేరుకున్నారు. వీరిని గాంధీ కుటుంబం సాదరంగా ఆహ్వానించింది. వారికి ప్రత్యేక ఆతిథ్యం ఏర్పాటు చేయడమే గాక.. సోనియా, ప్రియాంక, రాహుల్ గాంధీ కూడా మహిళలతో కలిసి భోజనం చేశారు. వారితో ఆప్యాయంగా ముచ్చటించారు. ఈ సందర్భంగా ఓ మహిళ సోనియా గాంధీ చెవిలో.. 'రాహుల్‌కు పెళ్లి చేద్దామా?' అని అడిగారు. దీనికి ఆమె బదులిస్తూ.. 'మీరే ఓ మంచి అమ్మాయిని చూడండి' అని అనడంతో రాహుల్ నవ్వుతూ 'అవుతుంది.. అవుతుంది' అని చెప్పారు.

**సోనియా భావోద్వేగం..** మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ మరణం గురించి మహిళలు సోనియాను అడగ్గా ఆమె ఒకింత భావోద్వేగానికి గురయ్యారు. ఆ సమయంలో అమ్మ చాలా కుంగుబాటుకు లోనయ్యారని, కొన్ని రోజుల పాటు అన్నం, నీళ్లు ముట్టలేదని ప్రియాంక చెబుతుండగా సోనియా కన్నీటిపర్యంతమయ్యారు. ఆ తర్వాత తేరుకుని మహిళలతో సరదగా ముచ్చటించారు. అనంతరం మహిళా రైతులతో కలిసి సోనియా, ప్రియాంక నృత్యం చేశారు.

## వరదల్లో బురద రాజకీయం చేస్తున్న విపక్షలు: మంత్రి పువ్వాడ

ఖమ్మం: కొందరు వరదల్లో బురద రాజకీయం చేస్తున్నారని మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఏకధాటిగా కురిసిన వర్షాలతో ఖమ్మం నగరాన్ని మున్నేరు వాగు ముంచెత్తిందని చెప్పారు. అయితే ప్రాణనష్టం జరగకుండా చర్యలు చేపట్టామని తెలిపారు. మున్నేరు వరద బాధిత కుటుంబాలకు పువ్వాడ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత హెల్త్‌క్యాంపును మంత్రి పువ్వాడ ప్రారంభించారు. ఎంపీ నామా నాగేశ్వర రావుతో కలిసి వరద బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. వెయ్యి మందికి నిత్యావసర సరుకులు అందిస్తున్నామని వెల్లడించారు. కాగా, మున్నేరు వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎంపీలు నామా నాగేశ్వర రావు, వద్దిరాజు రవిచంద్ర పర్యటించారు. మోతినగర్, జలగంనగర్, కేబీఆర్‌నగర్‌లో బాధితులను పరామర్శించారు. సహాయక చర్యలు ముమ్మరం చేయాలని అధికారులను ఆదేశించారు.



## జూరాల ప్రాజెక్టుకు కొనసాగుతున్న వరద.. మూసీలో 9 గేట్లు ఎత్తివేత

మహబూబ్‌నగర్/నల్లగొండ: కృష్ణా నది పరీవాహంలో కురుస్తున్న వర్షాలతో గద్వాల జిల్లాలోని జూరాల ప్రాజెక్టుకు భారీ వరద ప్రవాహం కొనసాగుతున్నది. ఎగువ నుంచి ప్రాజెక్టులోకి 35 వేల క్యూసుక్కుల నీరు వస్తున్నది. దీంతో అధికారులు 54,621 క్యూసెక్కుల నీటిని శ్రీశైలానికి విడుదల చేస్తున్నారు. జూరాల పూర్తిస్థాయి నీటిమట్టం 318.516 అడుగులు. ప్రస్తుతం 317.030 అడుగుల వద్ద ఉన్నది. ఇక ప్రాజెక్టులో మొత్తం 9.657 టీఎంసీల నీటిని నిల్వ ఉంచవచ్చు. ఇప్పుడు 6.786 టీఎంసీ నీరు నిల్వ ఉన్నది. కాగా, నల్లగొండ జిల్లాలోని మూసీ ప్రాజెక్టుకు వరద పోటెత్తింది. దీంతో ప్రాజెక్టు 9 గేట్లు నాలుగు అడుగుల మేర పైకిఎత్తి 55,474 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు నీటి విడుదల చేస్తున్నారు. భారీగా నీటిని విడుదల చేయడంతో దిగువ ప్రాంత ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. ప్రాజెక్టులో ప్రస్తుతం 38,852 క్యూసెక్కుల వరద వచ్చిచేరుతున్నది. కాగా, మూసీ పూర్తిస్థాయి నీటిమట్టం 645 అడుగులు. ప్రస్తుతం 642 అడుగుల వద్ద నీరు ఉన్నది. గరిష్ఠ నిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా ఇప్పుడు 3.64 టీఎంసీలు ఉన్నాయి. కందకుర్తి వద్ద గోదావరి ఉగ్రరూపం Heavy rains రెండు రోజులుగా రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. గోదావరి ముఖద్వారమైన నిజామాబాద్ జిల్లా కందకుర్తి వద్ద వరద ఉగ్రరూపంలో ప్రవహిస్తున్నది. ఎగువ మహారాష్ట్ర నుంచి 3 లక్షల క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతుండడంతో పాటు నిజాంసాగర్ గేట్లు ఎత్తడంతో మంజీరా నది ద్వారా వరద భారీగా త్రివేణి సంగమం వద్ద పోటెత్తుతున్నది.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com